

ఉచిత ఇసుకేదీ?



సమావేశంలో ప్రసంగిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా, ఎంపీ, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు



ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

- ఎవరికి ఎప్పుడిచ్చారో చెప్పాలి
- రీచ్‌లకు రౌడీలను కాపాలాపెట్టారు
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం
- నూరుశాతం ఈ-క్రాప్ బాధ్యత వ్యవసాయశాఖదే
- ఎన్నికల తర్వాత అందరూ ఒకటే : కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని

గుంటూరు సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వం ఉచితంగా ఇసుక అంటుంది. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడ.. ఎప్పుడు.. ఎవరికి ఇచ్చారో చెప్పాలి. ఇసుక రీచ్‌లకు రౌడీలను కాపాలాపెట్టి లోపలికి వస్తే కాళ్లు విరగ్గొడతాం అంటున్నారు. వేల టన్నుల ఇసుక ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతుంది. అమరావతి మండలంలోని జిడుగు, ధరణికోట, వైకుంఠపురం రీచ్‌ల నుంచి రేయింబవళ్లు వందల లారీల ఇసుక బయటకు పోతుంది. అధికారులు ఏమి చేస్తున్నారు..' అని పలువురు జడ్పీటీసీలు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అధ్యక్షత వహించిన సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, ఏసురత్నం, మర్రి రాజశేఖర్, మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నక్కా ఆనందబాబు, కలెక్టర్ నాగలక్ష్మి, బాపట్ల, పల్నాడు జేసీలు ప్రఖార్ జైన్, సూరజ్‌ధనుంజయ్, సీఈవో జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ పాల్గొన్నారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ సభ్యులు చెప్పే సమస్యలు విని, వాటికి పరిష్కారం అన్వేషించేందుకే తాను ఈ సమావేశంలో పాల్గొన్నట్లు చెప్పారు. ఎన్నికల వరకే రాజకీయాలని ఆ తర్వాత అందరూ ఒకటేనని చెప్పారు. జిల్లా పరిషత్ నూతన భవన నిర్మాణం కోసం అవసరమైన నిధులను ఎక్కడ నుంచి తీసుకురావచ్చో ఆలోచించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. వరి కోతలు ఆరంభమైనా కొనుగోలు కేంద్రాలు తెరవలేదని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ హనుమంతరావు ప్రశ్నించారు. దీనిపై బాపట్ల జేసీ స్పందిస్తూ మంగళవారం నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుస్తామని చెప్పారు. తేమ ఎక్కువ ఉందని పత్తి కొనుగోలు చెయ్యకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఎమ్మెల్సీ రాజశేఖర్ ప్రస్తావించగా, కేంద్ర మంత్రి పెమ్మసాని జోక్యం చేసుకుని ఈ సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే స్పందించానన్నారు. కొందరు సీసీఐ అధికారులు, దళారులతో కుమ్మక్కు అయిన విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేక అధికారిని నియమించేలా చూశానని చెప్పారు. కౌలు రైతుల సంఖ్య ఎందుకు తగ్గించి చెబుతున్నారని ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే రామాంజనేయులు ప్రశ్నించారు. కౌలు రైతులకు, పొలం యజమానులకు విడివిడిగా రుణాలు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ-క్రాప్ నూరు శాతం చేసే బాధ్యత వ్యవసాయశాఖదేనని ఎమ్మెల్యే రామాంజనేయులు తెలిపారు. తెల్ల, నల్ల నల్లితో మిర్చి రైతులు నష్టపోతున్నారని, అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. డ్రాగన్ ఫ్రూట్ సాగుకు పల్నాడు జిల్లాలోని భూములు అనువుగా ఉంటాయని ఉద్యానశాఖ అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్సీ ఏసురత్నం సూచించారు. పల్నాడు జిల్లాలో వ్యవసాయశాఖ నమోదు చేసిన విజిలెన్స్ కేసులపై ఎమ్మెల్సీ రాజశేఖర్ అధికారులను నిలదీశారు. శనగ విత్తనాలు సబ్సిడీపై జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు హష్మి ప్రస్తావించారు. వరికపూడిశెల నిర్మాణ పనులను రూ.290 కోట్లతో మెగా సంస్థ దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. అమరావతి మండలం కృష్ణ కెనాల్ జంగిల్ క్లియరెన్స్ పనులకు టెండర్ల ప్రక్రియ త్వరలోనే ముగుస్తుందని చెప్పారు. నరసరావుపేట కేంద్రంగా నూనెలు కల్తీ జరుగుతుందని, వాటి వల్ల ఎందరో మరణిస్తున్నారని జడ్పీటీసీ ఓబుల్‌రెడ్డి తెలిపారు. దీనిపై సమాధానం చెప్పే అధికారులు లేకపోవడంపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. అమరావతి మండలంలో 25 పైగా అనధికార వెంచర్లు వేశారని, దానివల్ల రైతులు నష్టపోతున్నారని ఎంపీపీ హనుమంత రావుయాదవ్ తెలిపారు.

ఫీజుల కోసం పీడిస్తున్నారు..

ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించే విషయంలో జడ్పీ సమావేశంలో చర్చ జరిగింది. విద్యా సంవత్సరం మధ్యలో పేద విద్యార్థులను ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని (మిగతా 8వ పేజీలో..)

కనిపించని మంత్రులు

- 17 మంది ఎమ్మెల్యేలకు ఇద్దరే హాజరు

మంత్రులు, మెజారిటీ ఎమ్మెల్యేలు లేకుండానే జడ్పీ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ముగ్గురు మంత్రులు, 15 మంది ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాత్రమే హాజరయ్యారు. వాస్తవానికి జడ్పీ సమావేశం గురువారం జరగాల్సి ఉంది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున ఎమ్మెల్యేల సౌలభ్యం కోసం అని శనివారానికి వాయిదా వేశారు. అయినా మంత్రులు, ఎమ్మెల్యేలు సమావేశానికి రాలేదు. కూలేందుకు సిద్ధంగా ఉన్న జడ్పీ భవనాన్ని మంత్రులకు చూపించాలని అధికారులు, జడ్పీటీసీలు భావించారు. అయితే వారెవ్వరూ రాకపోవడంతో నిరాశ చెందారు. జిల్లా లోని ముఖ్యమైన సమస్యలపై పలువురు సభ్యులు ప్రశ్నలు సంధించినా అధికారుల నుంచి సరైన సమాధానాలు రాలేదు. అదే ఎమ్మెల్యేలు, మంత్రులు ఉంటే అధికారులు బాధ్యతగా సమాధానాలు చెప్పి ఉండేవారని పలువురు అభిప్రాయపడ్డారు.

పట్టభద్ర ఓటర్లు.. 2.90 లక్షలు

- ముసాయిదా జాబితా విడుదల
- అర్హులు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు
- 40వేలకుపైగా దరఖాస్తుల తిరస్కారం

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణ - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి ముసాయిదా ఓటర్ల జాబితాని ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఆరు జిల్లాల్లో కలిపి 2 లక్షల 90 వేల 978 మంది దరఖాస్తులను ఆమోదించి వారికి ఓటుహక్కు కల్పిస్తూ ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చి విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం శనివారం సాయంత్రం డ్రాఫ్ట ఓటరు లిస్టుని విడుదల చేసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందజేసింది. ఇంచుమించుగా 40 వేలకు పైగా దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించింది. ఏ కారణంతో ఓటుహక్కుని తిరిస్కరించారో కూడా దరఖాస్తుదారుడు సంబంధిత బీఎల్‌వో/ఏఈఆర్‌వోని సంప్రదించి తెలుసుకోవచ్చు. కాగా తిరస్కరించిన దరఖాస్తులపై అభ్యంతరాలుంటే నివేదించుకునే అవకాశం కల్పించింది. అలానే ఇంకా ఎవరైనా ఓటరుగా నమోదు కాక పోయి ఉంటే కొత్తగా ఫారం-18 దరఖాస్తు చేసుకునే వెసులుబాటుని కల్పించింది. పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటుహక్కు కోసం గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, కృష్ణ, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో 3 లక్షల 32 వేల 783 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని బీఎల్‌వోలు తొలుత పరిశీలించి అన్ని సవ్యంగా ఉంటే ఏఈఆర్‌వోకు నివేదించారు. ఏఈఆర్‌వో తన రిమార్కులుతో ఆమోదించడమా, తిరస్కరించడమా అనేది పేర్కొంటూ ఈఆర్‌వోకు పంపారు. ఏఈఆర్‌వోల రిమార్కులు నిబంధనల మేరకు ఉన్నవో, లేవో సరి చూసి ఈఆర్‌వో ఖాజావలి తుది నిర్ణయం తీసుకున్నారు. ఓటరు జాబితాలను దరఖాస్తుదారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సరి చూసుకుని వాటిపై ఏమైనా క్లెయిమ్‌లు/అభ్యంతరాలు ఉంటే నివేదించాలని ఈఆర్‌వో సూచించారు. ఇందుకోసం డిసెంబరు 9 వరకు అవకాశం ఉందని (మిగతా 6వ పేజీలో..)

ముసాయిదా ఓటర్ల జాబితా..

జిల్లా పేరు	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
ఏలూరు	8998	5574	0	14572
కృష్ణ	31950	24601	5	56556
ఎన్టీఆర్	38270	26110	11	64391
గుంటూరు	50683	35980	16	86679
బాపట్ల	12883	7500	4	20387
పల్నాడు	32576	15814	3	48393
మొత్తం	175360	115579	39	290978



ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకు ఘనస్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

- వినుకొండలో అడుగడుగునా అపూర్వ స్వాగతం
- ఆంజనేయులును ఘనంగా సత్కరించిన కూటమి నేతలు

చీఫ్‌విప్ జీవీకి బ్రహ్మరథం

వినుకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చీఫ్‌విప్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి శనివారం వినుకొండ నియోజకవర్గానికి విచ్చేసిన జీవీ ఆంజనేయులుకు కూటమి శ్రేణులు బ్రహ్మరథం పట్టాయి. అడుగడుగునా ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు ఆంజనేయులను ఘనంగా సత్కరించారు. శావల్యాపురం మండలం గంటావారిపాలెం వద్ద కూటమి నేతలు, కార్యకర్తలు జీవీకి ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రారంభమైన ఊరేగింపు వినుకొండలోని శివయ్యస్తూపం వరకు సాగింది. వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. బాణ సంచా పెద్దఎత్తున కాల్చారు. ఎక్స్ కవేటర్లతో గజమాలలతో జీవీని సత్కరించారు. మహిళలు నీరా జనాలు పలికారు. యువకులు ద్విచక్ర వాహనాలతో ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై నుంచి ఆంజ నేయులు ప్రజలకు అభివాదం చేశారు. శావల్యాపురంలో ఎన్టీఆర్, పరిటాల రవి, వినుకొండలో ఎన్టీఆర్ విగ్రహాలకు జీవీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వినుకొండలో జరిగిన సభలో జీవీ మాట్లాడుతూ చీఫ్‌విప్ పదవితో క్యాబినెట్ హోదా దక్కడం వినుకొండకు గర్వకారణమన్నారు. వినుకొండను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. అనంతరం గంగినేని కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు జీవీని సత్కరించారు.



స్థూపం సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యేలు జీవీ, చదలవాడ, జూలకంటి

- తక్కువ ప్యాకేజీలకే వైద్య సేవలు అందించవచ్చు
- ఐఎంఏ రాష్ట్ర సదస్సులో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని

మెడికల్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు



సీనియర్ వైద్యులు బసవపున్నయ్య, కృష్ణారావు, గోపాలకృష్ణను సన్మానిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు మెడికల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ టూరిజం అభివృద్ధికి అద్భుత అవకాశాలు ఉన్నాయి. అతి తక్కువ ఖర్చుతో చక్కటి వైద్యసేవలు అందించే సత్తా మన తెలుగు వైద్యులకు ఉంది.. అని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో శనివారం రాత్రి జరిగిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర శాఖ 66వ వార్షిక సదస్సులో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ గార్లపాటి నందకిషోర్‌ను కేంద్రమంత్రి అభినందించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ విదేశాలతో పోలిస్తే మన దేశంలో చౌకగా వైద్యసేవలు అందుబాట్లో ఉన్నట్లు తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకుని ఏపీలో మెడికల్ టూరిజం అభివృద్ధి కృషి చేయాలని చెప్పారు. రాష్ట్రంలో నిష్ణాతులైన వైద్యనిపుణులు విదేశీ రోగులను ఆకర్షిస్తే తక్కువ ప్యాకేజీలకే వైద్య సేవలు అందించవచ్చన్నారు. దీనివల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. వైద్యులపై జరుగుతున్న దాడులను నిరోధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి తగిన పరిష్కారమార్గం కనుగొంటానని హామీ ఇచ్చారు.

ఆసక్తికరంగా సాగిన సైంటిఫిక్ సెషన్

ఐఎంఏ ఏపీకాన్ 2024లో జరిగిన సైంటిఫిక్ సెషన్ ఆసక్తికరంగా జరిగింది. వైద్య రంగంలో కృత్రిమ మేధ పాత్ర అనే అంశంపై ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు ప్రసంగించారు. హృద్రోగ వైద్య రంగంలో మనిషి కన్ను చూడలేని అంశాలను కృత్రిమ మేధతో తెలుసుకోవచ్చన్నారు. అత్యవసర చికిత్స, గుండెపోటును ఖచ్చితంగా నిర్ధారించగల ట్రాన్స్‌మిషన్ ఈసీజీ టెక్నాలజీ ఏఐతో అందుబాట్లోకి వచ్చినట్లు చెప్పారు. రక్తనాళాల్లో 80 శాతం పూడికలు ఉన్నా స్టెంట్ అవసరమా? లేదా? అనే అంశాన్ని ఏఐతో ఖచ్చితంగా నిర్ధారించవచ్చని తెలిపారు. మోకీళ్ల మార్పిడిలో రోబోటిక్ పాత్ర అనే అంశంపై సాయిభాస్కర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ సాంకేతికత వినియోగం పెరిగే కొద్దీ పేదలకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. మోకీళ్ల అరుగుదల రోగులకు పర్సనలైజ్డ్ రోబోటిక్ నీ ఆర్థోప్లాస్టీ, ఇతర శస్త్రచికిత్సలపై డాక్టర్ వై సుబ్రహ్మణ్యం ప్రసంగించారు. హెచ్‌ఐవీ చికిత్సల్లో నూతన అంశాలపై డాక్టర్ రేవూరి హరికృష్ణ, నూతన ఔషధాలతో ఆరోగ్య పరిరక్షణపై డాక్టర్ కొంగర శ్రీకాంత్ ప్రసంగించారు. యాంటీబయోటిక్ మందుల దుర్వినియోగం అరికడతామని, ప్రజల్లో అవగాహన కల్పిస్తామని వైద్యులు ప్రతిజ్ఞ చేశారు. సీనియర్ వైద్యులు కొండబోలు బసవపున్నయ్య, జీవీ కృష్ణారావు, మద్దినేని గోపాలకృష్ణలను కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జీ నందకిషోర్ సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌వీ అశోకన్, జాతీయ కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్ వీ నాయక్, జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ జీ సమరం, ఏపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ జయచంద్రనాయుడు, తెలంగాణ ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి, సదస్సు ఆర్గనైజింగ్ కమిటీల ప్రతినిధులు ఈదర కృష్ణమూర్తి, వై సుబ్బారాయుడు, టీ సేవకుమార్, బీ సాయికృష్ణ, సీహెచ్ విశ్వేశ్వరరావు, పీవీఎస్ హరిత తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సంపద!

- దేశంలోనే ఏకైక ఐల్యాండ్ మ్యూజియం
- బౌద్ధమత చిహ్నాలు
- నాటి చరిత్రకు సజీవ సాక్ష్యాలు
- ఇదీ నాగార్జున కొండ అద్భుతం



8

రాజధాని రైతుల ప్లాట్లకు

ఈ - లాటరీ

- సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో లాటరీ తీసిన అడిషనల్ కమిషనర్

6

మిర్చియార్డులో

సైరన్ పునరుద్ధరణ

- పర్సన్ ఇన్‌చార్జి అమిలినేని భార్గవతేజ ఆదేశాలు
- సైరన్ మోగక ముందు అమ్మకాలు జరపరాదని స్పష్టం

ఉచిత న్యాయ సహాయాన్ని

సద్వినియోగం చేసుకోండి

వర్సిటీలో న్యాయ సలహా కేంద్రం ఏర్పాటు హర్షణీయం : రెక్టార్ ఆచార్య రత్నషీలామణి

మిర్చియార్డులో ఎగుమతి

వ్యాపారస్తులకు శఠగోపం

రూ.20 కోట్లకు పైగా నట్టేట ముంచిన కమీషన్ వ్యాపారి

26న మంజులారెడ్డి

ప్రమాణ స్వీకారం

రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా...

మిర్చియార్డులో సైరన్ మోగించే విధానం పునరుద్ధరణ

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో సైరన్ మోగించిన తర్వాత వ్యాపార లావాదేవీలు ప్రారంభించే విధానాన్ని తిరిగి అమలు చేయాలని పర్సన్ ఇన్‌ఛార్జ్ అమిలినేని భార్గవ తేజ నిర్ణయించారు. ఈ మేరకు యార్డు అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. శనివారం కమీషన్, ఎగుమతి వ్యాపారస్తులకు మిర్చియార్డు అధికారులు ఎస్ఎంఎస్‌ల ద్వారా ఈ సమాచారాన్ని పంపించారు. సోమవారం నుంచి ఉదయం 7 గంటలకు యార్డులో సైరన్ మోగిస్తామని, ఆ తర్వాత లావాదేవీలు ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. సైరన్ మోగక ముందు అమ్మకాలు జరపరాదని స్పష్టం చేశారు. దీనివలన రైతుకు నష్టం జరగకుండా ఉంటుందని అధికారులు తెలిపారు. కొన్నేళ్ల నుంచి ఒక సమయం అంటూ లేకుండా రైతు మార్కెట్‌కి రాక ముందే కొంతమంది కమీషన్ వ్యాపారస్తులు రాత్రి దిగుమతి అయిన సరుకుని ఎగుమతిదారులకు విక్రయించేస్తున్నారు. రైతు వచ్చిన తర్వాత మీ మిర్చి టిక్కీలను అమ్మేశామని చెప్పి ధర తగ్గించి చెబుతున్నారు. దీంతో వచ్చిందే దక్కుదల అని కమీషన్ వ్యాపారి అమ్మిన ధరకు నగదు తీసుకొని వెళ్తున్నారు. దీనిపై పర్సన్ ఇన్‌ఛార్జ్ భార్గవ తేజకు ఫిర్యాదులు వెళ్లడంతో ఆయన గతంలో అమలు చేసిన సైరన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందిగా ఆదేశించారు.

మిర్చియార్డులో ఎగుమతి వ్యాపారస్తులకు శఠగోపం

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో కొంతమంది ఎగుమతి వ్యాపారస్తులను ఒక కమీషన్ వ్యాపారి భాగస్వామి నమ్మించి నట్టేట ముంచాడు. దాదాపుగా రూ.20 కోట్లకుపైగా శనివారం సాయంత్రానికి అప్పు తేలినట్లు సమాచారం. ఇంకా ఈ మొత్తం పెరిగే అవకాశం ఉందని వ్యాపారస్తులు చెబుతున్నారు. యార్డులో గత ఆరేళ్లుగా ఒక దిగుమతి వ్యాపారస్తుడు మిర్చి అమ్మకాలు చేస్తున్నారు. రోజుకు దాదాపుగా 6 వేల టిక్కీలను ఎగుమతిదారులకు రైతుల ద్వారా అమ్మిస్తున్నారు. ఏటా టర్నోవర్ రూ.150 కోట్ల నుంచి రూ. 200 కోట్ల వరకు చేస్తున్నారు. ఈ కమీషన్ వ్యాపారి అనధికారికంగా మరో పార్టనర్‌ను కూడా చేర్చుకున్నారు. నమ్మకంగా వ్యాపారం చేస్తుండటంతో ఎగుమతిదారులు విచ్చలవిడిగా అప్పులు ఇచ్చారు. అయితే ఆ పార్టనర్ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బెట్టింగులకు పాల్పడటంతో భారీగా నష్టపోయినట్లు సమాచారం. మూడు రోజుల నుంచి ఆ పార్టనర్ కనిపించకపోతుండటంతో, ఎగుమతి వ్యాపారస్తులు సంబంధిత కమీషన్ వ్యాపారిని నిలదీస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 585.40 అడుగులు ఉంది. ఇది 298.58 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,000 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3667 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 12,667 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 28,434 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

పింఛన్ల ఘనత సీఎం చంద్రబాబుదే

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

వినుకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ ఇచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు దక్కిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ప్రభుత్వ చీఫ్ విప్‌గా క్యాబినెట్ హోదాలో తొలిసారిగా వినుకొండకు వస్తున్న జీవీ ఆంజనేయులుకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం నరసరావుపేట రోడ్డులోని గంగినేని కల్యాణ మండపంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీకి ఆత్మీయ అభినందన సన్మాన సభ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి పాల్గొన్నారు. మంత్రి డోలా తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ రాష్ట్రంలో 16,450 డీఎస్సీ ఉద్యోగాలు ఇవ్వనున్నామని, రూ.8750 కోట్లతో ప్రధాన రోడ్లు ఆధునికీకరణ, రూ. 5 వేల కోట్లతో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ముందుకు వెళ్దామని కూటమి నేతలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ త్వరలో నెట్‌క్యాప్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో నూతన విద్యుత్ ఉత్పత్తి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ బిల్లులు పెంచబోమని తెలిపారు. వైసీపీ హయాంలో గాడితప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ప్రసంగించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మానుకొండ శివప్రసాద్, రాష్ట్ర జనసేన అధికారి ప్రతినిధి కన్న రజనితోపాటు ఉమ్మడి కూటమి నేతలు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రులు డోలా, గొట్టిపాటి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

సత్తెనపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని ఆత్మహత్యాయత్నం శనివారం పట్టణంలో జరిగింది. అచ్చంపేటకు చెందిన ఎం.కీర్తన పట్టణంలోని ప్రైవేట్ కళాశాలలో ఏఎన్ఎం కోర్సు చదువుతుంది. స్థానిక ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహంలో నివాసం ఉంటుంది. శనివారం కూడా కళాశాలకు వెళ్లింది. అనారోగ్యంగా ఉందని సోదరుడికి కబురు చేయటంతో ఆమె సోదరుడు వచ్చి కళాశాల నుంచి ఏరియా వైద్యశాలకు తీసుకు వెళ్లాడు. వైద్యులు, సిబ్బందికి తాను జ్వరం మాత్రలు ఎక్కువ సంఖ్యలో తీసుకున్నట్లు తెలియజేసింది. దీంతో కీర్తనకు అత్యవసర వైద్య సేవలు అందించారు. జ్వరం మాత్రలు ఎందుకు మింగింది అనేది తెలియరాలేదు. ఇటీవలనే ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినులు మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసిన సంగతి విదితమే.

డీఆర్ఎం కప్‌లో పోటాపోటీగా మ్యాచ్‌లు

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎం కప్-2024లో భాగంగా జరుగుతున్న క్రీడల పోటీలు పోటాపోటీగా సాగుతున్నాయి. శనివారం రైల్‌వికాస్ భవన్‌లో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ సెమీ ఫైనల్స్‌లో జి.రాజ్‌పాల్, షేక్ రియాజ్ 21-6, 21-11 స్కోరుతో గెలుపొందారు. మరో మ్యాచ్‌లో అబ్బాస్, ప్రణయ్ గెలుపొంది ఫైనల్స్‌లో అడుగు పెట్టారు. క్రికెట్ మ్యాచ్‌లు నల్లపాడు, పేరేచర్ల గ్రౌండ్స్‌లో జరిగాయి. మొత్తం ఆరు మ్యాచ్‌లు జరగగా ఎస్‌పీ నల్గొండ, ఎస్‌పీ పల్నాడు, ఎస్‌పీ గుంటూరు, ఎస్‌పీ బాపట్ల, డీఆర్ఎం-11, ఎస్‌పీ పల్నాడు టీంలు గెలిచి పాయింట్ల పట్టికలో ముందంజలో నిలిచాయి. వాలీబాల్ మ్యాచ్‌లలో ఏడీఆర్ఎం ఎన్‌టీఆర్(బీ), గుంటూరు పోలీసు, ఎన్‌టీఆర్(ఏ) జట్లు గెలిచాయి.

26న మంజులా రెడ్డి ప్రమాణ స్వీకారం

రెంటచింతల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన చేర్రెడ్డి మంజులా రెడ్డి ఈ నెల 26న ఉదయం 9 గంటల 10 నిమిషాలకు పదవీ స్వీకార ప్రమాణం చేయనున్నారు. విజయవాడ లయోలా కళాశాల సమీపంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించబోతున్నారు. శనివారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి ప్రమాణ స్వీకారోత్సవానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. అలాగే తనకు చైర్మన్ పదవి రావడానికి కారకులైన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, యరపతినేని శ్రీనివాసరావుతోపాటు టీటీడీ బోర్డు మెంబర్, మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తికి ఆహ్వాన లేఖలు అందజేశారు.



మంత్రి కందుల దుర్గేష్‌ను ప్రమాణ స్వీకారానికి ఆహ్వానిస్తున్న మంజులా రెడ్డి

జీఎంసీకి 99 బ్యాచ్ విద్యార్థుల బస్సు విరాళం

గుంటూరు మెడికల్ నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలలో 1999వ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు మాతృ విద్యా సంస్థకు రూ.40 లక్షలతో లగ్జరీ బస్సును విరాళంగా అందజేయనున్నారు. ప్రస్తుతం వాడుతున్న కాలేజీ బస్సు ముప్పైఏళ్ల పాతది కావడంతో ఆ స్థానంలో కొత్త బస్సు సమకూర్చాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ వీ సుందరాచారి కోరడంతో పూర్వ విద్యార్థులు స్పందించారు. జీఎంసీ 1999 బ్యాచ్‌కు చెందిన ఎనిమిది మంది పూర్వ విద్యార్థులు ఒక్కొక్కరు రూ.5 లక్షల వంతున ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో రూ.40 లక్షల వ్యయంతో కొత్త బస్సు త్వరలో కాలేజీకి సమకూరనుందని ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి తెలిపారు. విరాళం అందజేసిన వారిలో గుంటూరుకు చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ భవనం హనుమా శ్రీనివాసరెడ్డితోపాటు ఒంగోలుకు చెందిన ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ మద్దుకూరి హనుమంతరావు, ఎన్నారై డాక్టర్లు దేవరపల్లి మురళీధర్‌రెడ్డి, డాక్టర్ కటారు రాజశేఖర్ , డాక్టర్ ఈదన రవిశంకర్ రెడ్డి, డాక్టర్ అప్పలనేని శ్రీరామ మూర్తి, డాక్టర్ పుణ్యాల శ్రీనివాసరెడ్డి (అమెరికా), డాక్టర్ ప్రభాక ర్‌రెడ్డి భీమిరెడ్డి (ట్రినిడాడ్, టుబాకో) ఉన్నారు. శనివారం డాక్టర్ భవనం హనుమా శ్రీనివాసరెడ్డి, పుణ్యాల శ్రీనివాసరెడ్డి తండ్రి చంద్రారెడ్డి బస్సు విరాళానికి సంబంధించిన పత్రాలను డాక్టర్ సుందరాచారికి అందజేశారు.



సుందరాచారికి లేఖను అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి

- వర్సిటీలో న్యాయ సలహా కేంద్రం ఏర్పాటు హర్షణీయం
- వర్సిటీ రెక్టార్ ఆచార్య రత్నషీలామణి

పెదకాకాని, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ, ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్న షీలామణి అన్నారు. శనివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పీజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్కూల్ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ విభాగాలు సంయుక్తంగా లీగల్ ఎయిడ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెక్టార్ రత్నషీలామణి హాజరై ప్రసంగించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలని సూచించారు. న్యాయవిద్యను అభ్యసిస్తున్న వారిలో అధిక శాతం మంది బాధితులు, అణగారిన వర్గాల ప్రజలు ఉండటం బాధాకరమన్నారు. గౌరవ అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం మాట్లాడుతూ ఈ విశ్వవిద్యాలయం అంతటా జీవవైవిధ్య చట్టాలు క్రియాశీలకంగా పనిచేస్తున్నాయని, ముఖ్యంగా వ్యక్తుల హక్కులను కాపాడేందుకు యూనివర్సిటీ యంత్రాంగం శాయశక్తుల కృషి చేస్తుందని చెప్పారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ కామర్స్ అండ్ లా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.సురేష్ కుమార్ మాట్లాడుతూ నేడు న్యాయ సహాయం అందించటానికి అనేక వ్యవస్థలతో పాటు అనేకమంది న్యాయ నిపుణులు అందుబాటులో ఉన్నా కూడా వాటిని అందుకుని లబ్ధి పొందేవారు చాలా తక్కువ మంది ఉన్నారని పేర్కొన్నారు. గుంటూరు ఫ్యామిలీ కోర్టు, 12వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి జి.చక్రపాణి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ వేధింపుల చట్టం గురించి వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) లీలావతి మాట్లాడుతూ తరతరాల కేసులతో సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకోవడం కంటే రాజీ పెట్టుకోవడం ద్వారా ఇరుపార్టీలు ఆనందం పొందవచ్చని పేర్కొన్నారు. గుంటూరు నాలుగో అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం. కుమిదిని మాట్లాడుతూ మహిళలపై గృహాల్లో జరుగుతున్న దాడులు, వారికి చట్ట ప్రకారం ఉన్న హక్కులను వివరించారు. న్యాయ విభాగాధిపతి ప్రొఫెసర్ లక్కరాజు జయశ్రీ మాట్లాడుతూ ఉద్యోగులు, విద్యార్థులకు ఈ కేంద్రం పలు విధాలుగా సహాయ పడుతుందని వివరించారు. చివరగా న్యాయమూర్తులను వర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ సురేష్ కుమార్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో న్యాయ విభాగపు అధ్యాపకులు డాక్టర్ నూతక్కి సతీష్, డాక్టర్ పీవీ రమణ, డాక్టర్ వై.ఎన్.వి.కిషోర్ కుమార్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ జి.సతీష్ కుమార్, డాక్టర్ జ్యోతి సంపూర్ణ, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వర్సిటీ రెక్టార్ ఆచార్య రత్నషీలామణి

పట్టభద్ర ఓటర్లు.. 2.90 లక్షలు

(5పేజీ తరువాయి)

చెప్పారు. తమ వద్దకు వచ్చిన క్లెయిమ్‌లు/అభ్యంతరాలను డిసెంబరు 25వ తేదీ లోపు పరిష్కరించి తుది ఓటర్ల జాబితాని ఆ నెల 30న విడుదల చేస్తామన్నారు. ఓటరు నమోదు కోసం ఏఈఆర్‌వోలు 188, డిజిగ్నేటెడ్ అధికారులు 104, అదనపు డిజిగ్నేటెడ్ అధికారులు 119 మంది సేవలను వినియోగించుకున్నట్లు తెలిపారు. ఈ దఫా పోలింగ్ కోసం ఆరు జిల్లాలో 416 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుకు ఈసీ నిర్ణయించింది. వాటిలో ఏలూరు జిల్లాలో 20, కృష్ణాలో 76, ఎన్‌టీఆర్‌లో 101, గుంటూరులో 118, బాపట్లలో 28, పల్నాడు జిల్లాలో 73 పోలింగ్ కేంద్రాలను వినియోగించనున్నారు. క్లెయిమ్‌ల సమయంలో ఓటర్ల సంఖ్య పెరిగితే పోలింగ్ కేంద్రాల సంఖ్యని కూడా పెంచే అవకాశం ఉన్నది.

పట్టభద్రుల్లో పురుషులదే పైచేయి

జిల్లాలో సాధారణ ఓటర్లను చూసుకుంటే గత కొన్ని దశాబ్దాలుగా మహిళలే పైచేయిగా ఉన్నారు. వెయ్యి మంది పురుషులు ఉంటే 1070 మంది మహిళలు ఓటర్లుగా నమోదై ఉన్నారు. ఇటీవల విడుదల చేసిన ఎస్ఎస్ఆర్-2025 ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం ఓటర్లు 17 లక్షల 94 వేల 25 మంది ఉంటే మహిళలు 9 లక్షల 27 వేల 157, పురుషులు 8 లక్షల 66 వేల 710 మంది ఉన్నారు. ఈ విధంగా 60 వేల 447 ఎక్కువ ఓట్లతో మహిళలు పైచేయిగా ఉన్నారు. అయితే పట్టభద్రుల విషయానికి వచ్చేసరికి పురుషులే ఆధిక్యంలో ఉన్నారు. లక్షా 75 వేల 360 మంది పురుషులు ఉంటే మహిళలు లక్షా 15 వేల 579 మంది ఉన్నారు. 59,781 ఓట్లతో పురుషులు పైచేయిగా ఉన్నారు. దీనిని పరిగణనలోకి తీసుకుంటే చదువు విషయంలో నేటికీ అంతరాలు కొనసాగుతున్నట్లు స్పష్టమౌతుంది. చాలా ఇళ్లల్లో పురుషులను ఉన్నత చదువులు చదివిస్తూ విద్యార్థినులను ఇంటర్మీడియట్ వరకే పరిమితం చేస్తున్నారు. ఈ కారణంగానే ఓటరు నమోదులో వారి సంఖ్య తక్కువగా ఉన్నట్లు అర్థమవుతోంది.

భార్యను పచ్చడిబండతో కొట్టి హత్య

- అనుమానంతో భర్త ఘాతుకం
- మొవ్వ మండలం పెడసనగల్లులో ఘటన

కూచిపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనుమానంతో భార్యను పచ్చడి బండతో కొట్టి చంపిన ఘటన మొవ్వ మండలం పెడసనగల్లు గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. కూచిపూడి ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం కథనం ప్రకారం... గ్రామానికి చెందిన తలుపుల దుర్గా చిన్న కుమార్తె శివపార్వతి(34)కి గుంటూరు జిల్లా తాడికొండ మండలం బందరుపల్లె గ్రామానికి చెందిన తుపాకుల అశోక్‌తో 14 సంవత్సరాల కిందట వివాహం జరిగింది. వీరు పెడసనగల్లు గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు మగ సంతానం. శివపార్వతి కూచిపూడిలోని ఓ రెస్టారెంట్‌లో సహాయకురాలిగా పని చేస్తుంది. మద్యానికి బానిసైన అశోక్ భార్యను తరచూ వేధిస్తూ ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి శివపార్వతిని పచ్చడి బండతో కొట్టి హత్య చేశాడు. వారి ఇంట్లో నుంచి కేకలు వినిపించడంతో శివపార్వతి తల్లి దుర్గ వెళ్లి చూసే సరికి అల్లుడు అశోక్ పచ్చడి బండతో కనిపించాడు. ఆమెను పక్కకు తోసేసి పరారయ్యాడు. మంచంపై రక్తపు మడుగులో శివపార్వతి విగత జీవిగా పడి ఉంది. దీనిపై మృతురాలి తల్లి తలుపుల దుర్గ శనివారం కూచిపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న పామర్రు సీఐ శుభాకర్, ఎస్ఐ సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏపీఏయూటీఏ ప్రెసిడెంట్‌గా శైలజ

తాడికొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ అగ్రికల్చర్ యూనివర్సిటీ టీచింగ్ అసోసియేషన్ (ఏపీఏయూటీఏ) ప్రెసిడెంట్‌గా డాక్టర్ వి.శైలజను ఎన్నుకున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు తెలిపారు. శనివారం ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఏపీఏయూటీఏ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జోన్లలోని కార్యవర్గం సభ్యులు హాజరై నూతన కార్యవర్గ సభ్యులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రెసిడెంట్‌తోపాటు జనరల్ సెక్రటరీగా డాక్టర్ ఎస్.సాంబశివరావు, ట్రెజరర్‌గా డాక్టర్ ఎం.శ్రీకాంత్‌ను, వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ఎన్.వి.వి.ఎస్ దుర్గా ప్రసాద్, యూనివర్సిటీ డైరెక్టర్ సీడ్స్ డాక్టర్ ఎ.సతీష్ పాల్గొన్నారు.



ఏపీఏయూటీఏ కమిటీ అధ్యక్షులు, సభ్యులను అభినందిస్తున్న విశ్వవిద్యాలయం అధికారులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107.115.126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

ఆకట్టుకున్న శ్రీ కృష్ణ పారిజాతం-కూచిపూడి నృత్యరూపకం

గుంటూరు(తూర్పు), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ మరువాడ శుభ(అమెరికా) బృందం ప్రదర్శించిన శ్రీ కృష్ణ పారిజాతం-కూచిపూడి నృత్యరూపకం ఆకట్టుకుంది. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికపై శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమాన్నిపద్మశ్రీ అవార్డు గ్రహీత అబ్బారెడ్డి నాగేశ్వరరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య



శ్రీకృష్ణ పారిజాతంలో ఓ సన్నివేశం

ప్రారంభించారు. నృత్యరూపకానికి నట్టువాంగంపై డాక్టర్ మరు వాడ శుభ, మృదంగం గణేష్‌రావు, వాయులీనంపై విజయరాఘవన్, వేణువుపై కుమార్ బాబు వాయిద్య సహకారం అందించారు. సుధా శ్రీనివాస్, కౌశిక కల్యాణ్ గాత్ర సహ కారం అందించారు. అనంతరం కళాకారులను మంగళంపల్లి బాల మురళీకృష్ణ ప్రభుత్వ సంగీత నృత్యపాఠశాల ప్రిన్సిపల్ కే ఎస్ గోవిందరాజన్ ఘనంగా సత్కరించారు.

పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతం పెంచాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతంను పెంచాలని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ గోళ్లమూడి రాజా సుందరంబాబు అన్నారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడుతూ ఈ నెల 26 న నగరంలో రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్ర మంలో భాగంగా ఉదయం 10 గంటలకు స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వాంచిన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్టు తెలిపారు.



పూల అలంకరణలో శివలింగాలు, శివుని విగ్రహం

పుట్టలమ్మ తల్లి దేవస్థానంలో వైభవంగా కోటి దీపోత్సవం

గుంటూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా రూరల్ మండ లం చల్లావారిపాలెంలోని పుట్టలమ్మ తల్లి దేవ స్థానంలో శుక్రవారం రాత్రి కోటి దీపోత్స వం కార్యక్రమం వైభవంగా జరిగింది. పుట్ట లమ్మ తల్లి సేవా సంఘం వారు గ్రామ ప్రజల సహకారంతో ఈ దీపోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల మహిళా భక్తులు కూడా అధిక సంఖ్యలో హాజరయ్యారు. దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో శివుడి విగ్రహాన్ని అందంగా తీర్చిదిద్దారు. శివ లింగాలకు విశేష పూజలు చేశారు. రంగురంగుల విద్యుద్దీపాలు, వివిధ రకాల పూలు, పండ్లతో అలకరించి స్వామికి విశేష అభిషేకాలు చేశారు.

శనగలో తెగుళ్లను నివారించాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శనగ పంటలో వచ్చే తెగుళ్ల, పురుగు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని లాం, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వెంకటలక్ష్మి అన్నారు. గుంటూరు రూరల్ మండలం జొన్నల గడ్డలో శనివారం పత్తి, వరి, శనగ ప్రథమ శ్రేణిప్రదర్శన క్షేత్రం, రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి రైతూ తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని అన్నారు.

అరండల్ పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి సీఐగా వీరాస్వామి

గుంటూరు, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌కు ఇన్‌చార్జి సీఐగా వీరాస్వామిని నియమించారు. ఈ మేరకు శనివారం రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు. వీరాస్వామి గతంలో నల్లపాడు, పెదకాకాని, పెదకూరపాడు తదితర పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు. అరండల్‌పేట స్టేషన్‌కు పలువురు ప్రయత్నించినప్పటికీ చివరకు వీరాస్వామిని నియమించడం పట్ల అటు రాజకీయ, ఇటు పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, అరండల్‌పేట పోలీస్ స్టేషన్లో రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు రాచమర్యాదలు చేశారనే అభియోగాలపై సీఐ కొంకా శ్రీని వాసరావును వీఆర్ కు పంపిన విషయం విదితమే. అప్పటి నుంచి అరండల్ పేట పోలీస్ స్టేషన్ లో సీఐ కుర్చీ ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో సీసీఎస్‌లో ఉన్న సీఐ వీరా స్వామిని అరండల్‌పేట పోలీస్టేషన్‌కు ఇన్‌చార్జి సీఐగా నియమించారు.

కృష్ణనగర్‌లో న్యాయవాది ఇంట్లో చోరీ

స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణనగర్ రెండో లైన్‌లో న్యాయవాది బీఎం వరప్రసాదరావు ఇంట్లో చోరీ జరిగింది. మూడంతస్తుల భవనంలో కింది పోర్షన్‌లో ప్రసాదరావు, మధ్యభాగంలో ఆయన అన్న, పైఅంతస్తులో తల్లిదండ్రులు ఉంటున్నారు. వారం రోజుల క్రితం తండ్రి చనిపోయారు. అప్పటి నుంచి ఆయన తల్లి కింది పోర్షన్‌లో ఉంటున్న కుమారుడి వద్ద ఉంటోంది. ఇదిలా ఉండగా, శుక్రవారం అర్ధరాత్రిపై అంతస్తులోని ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు 41 గ్రాముల బంగారు ఆభరణాలు, అదేవిధంగా ఒక డైమండ్ నెక్లెస్, 400 గ్రాముల వెండి ఆభరణాలు, రూ. 35 వేల నగదు అప హరించుకుపోయారు. ఈ మేరకు శనివారం న్యాయవాది వరప్రసాద్ ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది.

ర్యాష్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

- రింగురోడ్డులో పర్యటించిన ఎస్పీ
- మితిమీరిన వేగంతో ప్రాణాలకు ముప్పు
- మద్యం తాగి వాహనాలు నడిపినా, స్నేక్ డ్రైవింగ్ చేసినా అరెస్టు

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మితిమీరిన వేగం ప్రాణాలకే ముప్పు అని ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు.స్థానిక రింగు రోడ్డులో శనివారం సాయంత్రం ఆయన పర్యటించారు. గుజ్జనగుండ్ల, కోరిటెపాడు, లక్ష్మీపురం ప్రాంతాల్లోని ప్రధాన రహ దారులో వాహనాల రద్దీని, రాకపోకలను గమనించారు. వాహన రద్దీ క్రమబద్ధీకరణ, అతివేగం నియంత్రణ, ర్యాష్ డ్రైవింగ్,స్నేక్ డ్రైవింగ్ అరికట్టడం మొదలగు అం శాలపై సంబంధిత పోలీస్ అధికారులతో కలిసి పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత వాహ నాలను గాల్లో నడుపుతూ ఇతర వాహనదారులను భయ భ్రాంతులకు గురిచేస్తూ, ప్రమాదాలకు కారణమవు తున్నారని అన్నారు. అటువంటి వారికి అడ్డుకట్ట వేయ డానికి తగిన ప్రణాళికలు రూపొందించే పనిలో భాగంగా ఈ పరిశీలన జరిగిందని చెప్పారు వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్ - స్నేక్ డ్రైవింగ్ వంటివి చేస్తే చట్టపరంగా అరెస్టు చేసి కోర్టుకు పంపుతామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధ నలు ఉల్లంఘించే వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి నగరంలో ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రదేశాలు, ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, విధుల్లో ఉండే ట్రాఫిక్ సిబ్బంది వద్ద కూడా బాడీవోర్న్ కెమెరాలు ఉంటాయని తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందాలతో ఆకస్మిక వాహన తనిఖీలు కూడా నిర్వాస్తామన్నారు. ఆకతాయిల ఆటలకు అడ్డుకట్ట వేసి, వారికి తీవ్రస్థాయిలో తగిన గుణపాఠం చెబుతామని తెలిపారు. తల్లిదండ్రులు, తమ పిల్లలు వాహనాలను ఏవిధంగా నడుపుతున్నారో పరిశీలించాలని, సరైన సూచనలు ఇవ్వాలని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులనే బాధ్యులను చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. డీఎస్పీలు సీతారామయ్య, మెహర్ జయ రాం ప్రసాద్ (వెస్ట్), ట్రాఫిక్ రమేష్ (ట్రాఫిక్), ట్రాఫిక్ సీఐలు వెంకన్న చౌదరి, అశోక్ కుమార్ (ఈస్ట్ ట్రాఫిక్), సింగయ్య (వెస్ట్ ట్రాఫిక్) పాల్గొన్నారు



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

'108' సేవలను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): '108' సేవ లను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. ఈ నెల 25 నుంచి '108' అంబులెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మె జరగనుంది. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో 108 అంబులెన్స్ ఎంపా యిస్ యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ జిల్లా అధ్యక్షుడు వై శివశంకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తలు మాట్లాడుతూ '108' ఉద్యోగులకు 8 గంటల పని విధానం, అధికారులు ఇచ్చిన హామీ మేరకు శ్లాబ్‌ల ప్రకారం అందరికీ వేతనాలు చెల్లించాలని, సహజ మరణం, ప్రమాదాలలో చనిపోయిన వారికి రూ25 లక్షల పరిహారం చెల్లించా లన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబరు 49ను పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో '108' అంబులెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏ రామకృష్ణ, ఎంఎల్ పార్టీ నాయకుడు ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, బీఎస్పీ నాయకుడు సీహెచ్ వాసు, ప్రజా సంఘాల, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాశం రామారావు, సమావేశంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

అదానీని అరెస్ట్ చేయాలి: సీపీఎం

గుంటూరు(తూర్పు), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఒప్పందాల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డ అదానీని అరెస్టు చేయాలని సీపీఎం నాయకులు వై నేతాజీ, నళినీకాంత్ డిమాండ్ చేశారు. స్థానిక శంకర్‌విలాస్ సెంటరులో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదానీ విదేశీ బొగ్గును పది శాతం కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభు త్వం రాష్ట్రాలకు షరతు పెట్టిందని, దీంతో విద్యుత్ ఛార్జీలు పెరిగి ఆ భారం ప్రజ లపై పడిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇటువంటి చీకటి ఒప్పం దాలన్నీ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ భావనారాయణ, ఎంఎ చిష్టి, బీ లక్ష్మణ రావు, బీ ముత్యాలరావు, కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మన దేశ రాజ్యాంగం మహోన్నతం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణప్రసాద్

గుంటూరు(విద్య),నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లోని రాజ్యాంగాల్లో మన దేశ రాజ్యాంగం మహోన్నతమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీ రామకృష్ణ ప్రసాద్ అన్నారు. స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ లా విభాగం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జస్టిస్ రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు న్యాయశాస్త్రాన్ని అభ్యసించి సమాజంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. ప్రతిరోజూ కొత్త విషయాలు తెలుసుకుంటూ న్యాయశాస్త్రాన్ని సమగ్రంగా తెలుసుకోవాలన్నారు. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని న్యాయ విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వీసీ ఆచార్య పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జస్టిస్ రామకృష్ణప్రసాద్

బీజేపీ నేతల సంబరాలు

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించడంపై గుంటూరు జిల్లా బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక శంకర్‌విలాస్ సెంటర్‌లో శనివారం బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచి పెట్టుకున్నారు. సంబరాలలో పార్టీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు, ఈదర శ్రీనివాసరెడ్డి, యడ్లపాటి స్వరూపరాణి, శనక్కాయల ఉమాశంకర్, తదితరులు పాల్గొన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఎన్నటికీ విశ్వసించరని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ పాండురంగ విఠల్ అన్నారు. మహారాష్ట్రలో మహాయతి కూటమి ఘన విజయంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ మీడియాతో మాట్లాడారు.

జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిని కలిసిన కలెక్టర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి

గుంటూరు(తూర్పు), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సంపత్ నగర్ లోని శారదా పీఠానికి విచ్చేసిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి ని శనివారం జిల్లా ప్రధాన న్యాయ మూర్తి వెవీఎస్‌బీజీ పార్థసారథి, కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందించారు. కార్యక్రమంలో ఆర్డీవో కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టికి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఎస్ నాగలక్ష్మి

సోషల్ మీడియా ఉన్మాదులను కట్టడి చేస్తాం: ఎమ్మెల్యే మాధవి

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడి యాను వేదికగా చేసుకొని, అసభ్య కరమైన పదజాలం, అసత్య ఆరోపణ లతో చెలరేగిపోయే ఉన్మాదులను చట్టపరంగా కట్టడి చేస్తామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళలపై, వారి కుటుంబ సభ్యులపై అనాగరిక భాషలో చెలరేగి పోయే సోషల్ మీడియా ఉన్మాదులపై తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు చాలా బాగా జరిగాయని, నగరంలో కుక్కల బెడద, టిడ్కో గృహాలకు మౌలిక సదుపాయాల కల్పన, ఖాళీ స్థలాల కారణంగా తలెత్తుతున్న ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయంలో అసెంబ్లీ సమావేశాలు చూసినప్పుడు చాలా బాధ, ఆవేదన కలిగేదని, కానీ, నేడు అసెంబ్లీ సమావేశాలు చాలా హుందాగా జరిగాయని పేర్కొన్నారు. సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్ళటానికి తన లాగా మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వారికి అవకాశం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకపోతే పదవులకు రాజీనామా చేయాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీకి రాని వారికి ఆ పదవులు ఎందుకని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

మహిళా సాధికారత కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత కూటమి ప్రభుత్వ లక్ష్యం అని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. పొన్నూరు రోడ్డు లోని అంజుమన్ ఇస్లామియా స్కూల్‌లో అంజుమన్ ఇస్లామియా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రానికి శనివారం ఆయన తన సొంత ఖర్చుతో కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన వంతు చేయూతను అందించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఇప్పటివరకు 60 బ్యాచులకు సుమారు 1800 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారని చెప్పారు. పేద, మధ్యతరగతి మహిళలు స్వయం ఉపాధి పొందేం దుకు మరిన్ని సదుపాయాలు కలిగించి వారి అభి వృద్ధికి కృషి చేస్తామని, శిక్షణ కాలంలో మహి ళలకు రూ.4500 స్టైఫండ్ అందించి వారికి అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా విశ్వకర్మ పథకం గురించి ప్రస్తావించారు. కార్యక్రమంలో అంజుమన్ ఇస్లామీయ కమిటీ సభ్యులు జహీద్ , షైదా, మాజీ కార్పొరేటర్ బాషి ,షోకాత్ ,హెచ్ఎం షాహినా బేగం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

'మలినేని'లో ముగిసిన 'ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్'

వట్టిచెరుకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక కళా శాలల్లో పాత తరహా బోధన, పాత విద్య అంశాలనే బోధిస్తున్నారని, దీనివల్ల పరిశ్రమలు ఆశించిన స్థాయికి విద్యార్థుల నైపుణ్యం చేరడం లేదని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ సీఈవో దాసరి రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని పుల్లడిగుంట గ్రామ సమీపంలో మలినేని లక్ష్మయ్య ఇంజనీరింగ్ కళాశాలలో ఆరు రోజులుగా జరుగుతున్న మైక్రో చిప్ ఎంబెడెడ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం శనివారం ముగింపు సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై వివిధ కళాశాలల నుంచి పాల్గొన్న ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు నైపుణ్యాన్ని పెంచుకొని విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందింపచేయాలని సూచించారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు మాట్లాడుతూ మెకానిక్, సివిల్, ఎలక్ట్రానికల్ వంటి ప్రముఖ ఇంజనీరింగ్ విభాగాల్లో అవకాశాలు తగ్గటంతో అందరూ కంప్యూటర్, సంబంధిత విభా గాల్లో ఎక్కువ అడ్మిషన్‌లు తీసుకుంటున్నారని, అది భవిష్యత్తుకు మంచిది కాదన్నారు. కార్యక్రమ కో-ఆర్డినేటర్ ఈసీఈ విభాగాధిపతి విజయసారథి, రిసోర్స్ పర్సన్ ప్రభు పాద సమల్ ప్రసంగించారు. మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మైక్రో చిప్ ఎంబెడెడ్ సిస్టమ్ ద్వారా విద్యార్థులకు నైపుణ్యాన్ని పెంపొందించటానికి అధు నాతన సౌకర్యాలతో కూడిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించారు. కార్య క్రమంలో ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు, డైరెక్టర్ దేవిరెడ్డి శ్రీనివాస కుమార్, డీన్ అకడమిక్ జంపని కిషోర్ బాబు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



శిక్షణా ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వివిధ కళాశాలల అధ్యాపకులు

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

గుంటూరు(విద్య),నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సృజనకు పదునుపెట్టి, భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎన్ మంగాదేవి అన్నారు. శ్రీవెంకటేశ్వర బాలకుటీర్, చేతన, చౌడవరంలో ఆర్ట్స్ సైన్స్ అండ్ ఫైన్ ఆర్ట్స్ ఎక్స్‌పో శనివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ మంగాదేవి మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని, నూతన ఆవిష్కరణలు చేసి, సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చిప్స్ ఫార్మసీ కాలేజ్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లేశ్వరావు, ఆస్టర్ రమేష్ హాస్పిటల్ దంత వైద్యులు డాక్టర్ నీలిమ, కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ విజయ్‌చంద్ మాట్లాడారు. బాల కుటీర్ సీఏవో దుర్గారఘురామ్, చేతన కార్యనిర్వాహకురాలు మరుద్వతి పాల్గొన్నారు.

25 కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ

గుంటూరు మెడికల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో వచ్చిన వరద బీభత్సం కారణంగా జిల్లాలో పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఆయా ప్రాంతాల్లో సమస్తం పోగొట్టుకుని జీవ నోపాధి కోల్పోయిన వారు ఎందరో ఉన్నారు. వాటిలో ఒకటి పెదలంక గ్రామం. ఈ గ్రామానికి చెందిన సమారు 25 కుటుంబాలకు ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పీ విజయ గుంటూరు లలితా హాస్పిటల్ తరపున శనివారం సహాయం అందజేశారు. నిత్యావసర వస్తువులు, బియ్యం, కందిపప్పు, వంటనూనె, దుప్పట్లు, చీరలను పంపిణీ చేశారు.



నిత్యావసరాలు అందజేస్తున్న డాక్టర్ విజయ



ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయం ఉద్యోగుల రాష్ట్ర నేతలు

బీఎల్‌ఓలకు గౌరవవేతనం విడుదలకు వినతి

గుంటూరు సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీఎల్‌ఓ (బూత్ లెవల్ ఆఫీసర్) లకు గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న గౌరవవేతనం వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్‌కి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక మంత్రిని కలిసిన ఉద్యోగుల సంఘం రాష్ట్ర నేతలు సుమారు 70 వేల మంది బీఎల్‌ఓలకు బకాయిలు చెల్లిం చాలని తెలిపారు. ఒక్కొక్కరికి రూ.21 వేల వరకు చెల్లించాలని, గ్రామ వార్డు సచి వాలయ ఉద్యోగులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లరేషన్ ఆలస్యం చేసినందున, మొదటి బ్యాచ్ వారికి రావాల్సిన 9 నెలల బకాయిలు, రెండో బ్యాచ్ వారికి రావా ల్సిన 5 నెలల బకాయిలు ఇవ్వాలని కోరారు. సచివాలయ ఉద్యోగుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మంత్రి తగు చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పార్థా మధు, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు షేక్ బషీర్ అహ్మద్, కార్యనిర్వాహక కార్య దర్శి వెంకటేశ్వర్లు, గుంటూరు జిల్లా సహాధ్యక్షులు పాదర్ల సతీష్, తెనాలి పట్టణ అధ్యక్షుడు జానీ బాషా, కార్యదర్శి ధర్మేంద్ర పాల్గొన్నారు

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏటీ అగ్రహారం మెయిన్‌రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా జరిగేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదే శించారు. ఏటీ అగ్రహారం రోడ్డు విస్తకరణకు సంబంధించి కోర్టులో కేసులు దాఖలు చేసిన వారితో కమిషనర్ చాంబర్‌లో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ సోమవారం నుండి 3 రోజుల్లో ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు మాస్టర్ ప్లాన్‌ని సర్వే చేసి బౌండరీలు ఫిక్స్ చేయాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ సర్వే సమయంలో కోర్టుకు వెళ్లిన వారికి కూడా ముందస్తు సమాచారం ఇవ్వాలని చెప్పారు. పెండింగ్ లో ఉన్న టీడీఆర్ బాండ్లు, స్ట్రక్చరల్ నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు, ఏసిపి వెంకటేశ్వరరావు, డిఈఈ మధుసూదన్, టీపీఎస్‌లు, టీపీబీఓలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

తగిన బలం లేకుండా వైసీపీ పోటీ సిగ్గుచేటు : కనపర్తి

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీకి తగినంత బలం లేదని తెలిసి కూడా పీఏసీ ఛైర్మన్ పదవికి పోటీ చేయడం, ఆ తర్వాత పోలింగ్ ను బహిష్కరించడం సిగ్గుచేటని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు విమర్శించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష హోదాకి కూడా పనికిరాని వైసీపీని ప్రజలు పక్కన పెడితే, మళ్లీ పీఏసీ ఛైర్మన్ పదవికి పోటీ చేయడమేమిటని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం చేస్తున్న ఖర్చులు, లెక్కల్లో తప్పులు దొర్లితే పరిశీలించే కీలక పదవికి ఆంధ్రా వీరప్పన్‌గా పేరుగాంచిన ఎర్రచందనం, మద్యం, మైనింగ్, భూ ఆక్ర మణల స్మగ్లర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పోటీ పెట్టి జగన్ పెద్ద తప్పు చేశారని విమ ర్శించారు. జగన్ చేసిన పాపాలకు తగిన పరిహారం చెల్లించుకోక తప్పదని అన్నారు. చంద్రబాబుపై యుద్ధం చేసి జగన్ ఓటమిపాలు కావాల్సిందేనని ఈ విషయాన్ని ఆయన తెలుసుకోవాలని అన్నారు. సమావేశంలో కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, మైనారిటీ సెల్ నాయకుడు పఠాన్ అస్మతుల్లా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు, పక్కన కార్పొరేటర్లు కొమ్మినేని తదితరులు



ఆక్స్‌ఫర్డ్ కిడ్డీస్ ఫెస్టివల్ వేడుకల్లో పాల్గొన్న డీఈవో సీవీ రేణుక తదితరులు

చిన్నారులను ప్రోత్సహిస్తే మెరుగైన ఫలితాలు

గుంటూరు(విద్య),నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో ఊహాశక్తి, గ్రహణశక్తి ఎక్కువగా ఉంటుందని, వారిని ప్రోత్సహిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని డీఈవో సీవీ రేణుక అన్నారు. స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం నిర్వహించిన ఆక్స్‌ఫర్డ్ కిడ్డీస్ ఫెస్టివల్‌కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డీఈవో మాట్లాడుతూ చిన్నారులకు ప్రాథమిక స్థాయి నుంచే సంస్కారంతో కూడిన విద్యను బోధించాలని సూచించారు. విద్యతోపాటు శారీరక వ్యాయామాలకు ప్రాధ్యామివ్వాలని అన్నారు. రమేష్ హాస్పిటల్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులు చిన్నారులకు మానవత్వంతో కూడిన కథలు చెప్పి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. సినీనటుడు నాగులపల్లి మానస్, పాఠశాల డైరెక్టర్లు విజయభాస్కరరెడ్డి, జోసెఫ్‌రెడ్డి, ప్రిన్సిపల్ అమీనాబేగం, వైస్‌ప్రిన్సిపల్ రమాదేవి, పీ సరోజిని పాల్గొన్నారు.

సీతారామయ్య హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు కార్పొరేషన్,నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలం నంబూరులోని వీవీఐటీ కళాశాలలో నిర్వహించిన బాలోత్సవంలో పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఆ పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ శనివారం తెలిపారు. వాద్య, సంగీత విభాగంలో జైనీల్ ద్వితీయ బహుమతి, కథా రచన విభాగంలో సహస్ర లియోరా తృతీయ బహుమతి, సంస్కృత శ్లోకాల విభాగంలో అభినవ వర్చస్వి, అద్వైత భారతి తృతీయ బహుమతి సాధించినట్లు పేర్కొన్నారు. పదుల సంఖ్యలో విద్యార్థులు పలు విభాగాలలో కన్సోలేషన్ బహుమతులు లభించాయని తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడారు. గెలుపొందిన విద్యార్థులను అభినందించిన వారిలో పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాద రావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపల్ కర్లపూడి పార్వతి దేవి, కోఆర్డినేటర్స్ దుర్గాశ్యామ్, తిరువీధుల శ్రీదేవి ఉన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించిన ఆర్వీఆర్అండ్‌జేసీ విద్యార్థులు

గుంటూరు(విద్య),నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కార్పొరేట్ సంస్థ ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్‌జేసీ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని సీఎస్ఈ, ఈసీఈ విభాగాలకు చెందిన విద్యార్థులు కె రాహుల్‌దేవ్, ఎండి పర్వాన్ ఫైజ్, అభినయ్‌కుమార్‌రెడ్డి, గారపాటి దిలీప్‌శ్రీ సాయి, ఎస్ ఆదిసయాన్‌బోస్, మారం వెంకటమైథిలి తదితరులు రూ. 5.3 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించారని తెలిపారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విద్యార్థికి ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం ఆర్థికసాయం అందించింది. కళాశాల ఫీజుల నిమిత్తం రూ. 10 వేలు అందించింది. గుంటూరు రూరల్ మండలం పొత్తూరుకి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి వరికల్లు యుగంధర్‌కు చదువు నిమిత్తం శనివారం ఆర్థిక సాయం అందించారు.

- దేశంలోనే ఏకైక ఐల్యాండ్ మ్యూజియం
- బౌద్ధమత చిహ్నాలు
- నాటి చరిత్రకు సజీవ సాక్ష్యాలు
- ఇదీ నాగార్జున కొండ అద్భుతం

అపూర్వ సంపద!


కొండపై గల మహాస్తూపం


అశ్వమేధ యజ్ఞశాల


బౌద్ధ సంపదతో మ్యూజియం అంతర్భాగం

నాగార్జున కొండ.. అణువణువు అద్భుతమే.. ఒక విజ్ఞాన గని.. వెలకట్టలేని జ్ఞాన సంపద.. ఆచార్య నాగార్జునుడు సంచరించిన పవిత్ర ప్రదేశం.. దేశంలోనే ఏకైక ఐల్యాండ్ మ్యూజియం.. నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్ రిజర్వాయర్లో డ్యాం నుంచి 14 కి.మీ. దూరంలో ఉంది.. లాంచీల ద్వారా కృష్ణానదిలో ప్రయాణించి కొండకు చేరుకోవడం ఎంతో మధురానుభూతిని కలిగిస్తుంది.

మాచర్ల రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో కృష్ణా నీటిని పెద్ద ఎత్తున నిల్వ ఉంచేందుకు రమారమి 600 అడుగుల లోతు తవ్వకాలు జరిగాయి. ఆ తవ్వకాల్లో తొలి శిలాయుగం నుంచి బృహత్శియనయుగం వరకు వృద్ధినొందిన మానవ నాగరికత పరిణామ దశలు, అప్పటి పనిముట్లు దొరికాయి. క్రీ.శ 3-4 శతాబ్దాలకు చెందిన శిలా ఫలకాలు, శాసనాలు బయటపడ్డాయి. ఇక్ష్వాకుల కాలం నాటి శాసనాలు, మధ్యయుగం నాటి శిల్పాలు, ఆ కాలపు మట్టి పాత్రలు, రాతి గొడ్డళ్లు, రాతి బరిసెలు, నాణేలు వంటి పూర్వీకుల జీవన శైలికి అద్దంపట్టే అపూర్వ సంపద దొరికింది. వీటన్నింటిని నాగార్జున కొండపై ఏర్పాటు చేసిన మ్యూజియంలో భద్రపరిచారు. 1956లో అప్పటి కేంద్ర సైంటిఫిక్ రీసెర్చ్, కల్చరల్ అఫైర్స్ మంత్రి హుమాయున్ కబీర్ ఈ మ్యూజియాన్ని ప్రారంభించారు.

బౌద్ధమత చిహ్నాలు..

బౌద్ధమతం ఇక్కడ వెల్లివిరిసినట్లు అనేక ఆనవాళ్లు తవ్వకాల్లో బయటపడ్డాయి. నాగార్జున కొండపై ఈ బౌద్ధ మతానికి చెందిన శాసన మండపం, స్నానఘట్టం, బౌద్ధారామం, మహాస్థూపం, సింహళ విహార్, అశ్వమేధ యజ్ఞశాల, స్వస్తికాంకిత స్తూపం పునఃప్రతిష్ఠించారు. 144 ఎకరాల వైశాల్యం కలిగిన నాగార్జున కొండపై అణువణువు జ్ఞాన సంపదతో కూడిందే.

ప్రయాణమూ.. ఆహ్లాదమే

నాగార్జున కొండకు వెళ్లాలంటే లాంచీల ద్వారానే ప్రయాణం. మాచర్ల మండలంలోని విజయపురిసౌత్ లాంచీ స్టేషన్ నుంచి 14 కి.మీ. మేర సుమారు ముప్పావు గంటపాటు లాంచీలో సాగే ఈ ప్రయాణం అత్యంత ఆహ్లాదంగా ఉంటుంది. వెండి జలపాతంలో ఎగిరె గిరి పడే చేపలు, సుదూరంగా కనిపించే పచ్చని కొండలు, ప్రతిక్షణం పలకరించే చల్లని గాలులు.. ఇలా ఎంతో మధురంగా ప్రయాణం సాగుతుంది. లాంచీలో ప్రయాణించేందుకు పెద్దలకు రూ. 200, పిల్లలకు రూ. 150 టిక్కెట్లను లాంచీ స్టేషన్లో విక్రయిస్తారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ఉచిత ప్రయాణం. ఏపీ టూరిజం ఆధ్వర్యంలో నడిచే మోటెల్ హోటల్, మాతా సరోవర్‌లలో విడిది చేయవచ్చు. ప్రభుత్వ అతిథి గృహం ఉన్నా, అది అధికారుల కోసమే.


నాగార్జున కొండపై గల మ్యూజియం

పర్యాటకుల సందడి

మాచర్ల రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున కొండపై శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. మండలంలోని విజయపురిసౌత్ లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు వివిధ లాంచీలలో చేరుకున్న పర్యాటకులు మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతిపనిముట్లు, బుద్ధుని పాలరాతి విగ్రహం, మట్టి కుండలు, బోధివృక్షం సందర్శించారు. అనుపులోని యాంఫీ థియేటర్ అశ్వమేధ యజ్ఞశాల, శ్రీరంగనాథస్వామి ఆలయాన్ని వీక్షించారు. అనంతరం ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు.



అక్రమ నిర్మాణాలు కూల్చివేత

◆ పోలీసుల బందోబస్తు మధ్య తొలగింపు ◆ కోర్టు ఉత్తర్వుల ప్రకారమేనన్న తహసీల్దారు


లాంలో కట్టడాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది

తాడికొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): లాం గ్రామంలోని జగనన్న కాలనీకి పక్కనే ఉన్న కొండ పోరంబోకు స్థలాల్లోని ఆక్రమణలను రెవెన్యూ, పోలీసు, పంచాయతీ సిబ్బంది శనివారం కూల్చివేశారు. కొండపోరంబోకు స్థలాలను అక్రమించుకుని చేపట్టిన అక్రమ నిర్మాణాలు గత కొంతకాలంగా పెరిగిపోతున్నాయి. ఈక్రమంలో పోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది ఎక్స్‌కవేటర్ సహాయంతో వాటిని కూల్చేశారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి కూల్చివేతల ప్రక్రియ జరిగింది. సుమారు 30 నిర్మాణాలను కూల్చివేశారు. రెండు, మూడు రోజులు గడువులో ఇళ్లు ఖాళీ చేయాలని నివాసం ఉన్న వారిని ఆదేశించారు. నివాసాలను ఖాళీ చేయని పక్షంలో చర్యలు తీసుకుంటామని తహసీల్దారు నాసరయ్య హెచ్చరించారు. కొందరు కోర్టులను ఆశ్రయించి నిర్మాణాలు తొలగించకుండా స్టేలు తీసుకువచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. గత వైసీపీ హయాంలో ఉన్నప్పుడు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అమ్ముకుని జేబులు నింపుకున్నారు. అప్పట్లో స్థలాలను అక్రమించుకున్న వారికి పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆక్రమణలపై టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లగా వాటిని తొలగించాలని ఆదేశించినా అప్పటి అధికారులు చర్యలు తీసుకోలేదు. ఇదే అదునుగా వైసీపీ నేతలు నకిలీ పొజిషన్ సర్టిఫికెట్లను తయారు చేయించి స్థలాలను విక్రయించారు. ఈక్రమంలో మరోసారి ఆక్రమణల తొలగింపుపై హైకోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చారు. నకిలీ పొజిషన్ సర్టిఫికెట్ల జారీపై విచారణ చేస్తే ఎన్నో అక్రమాలు బయటకు వస్తాయని టీడీపీ నాయకులు పేర్కొంటున్నారు.

సీజీహెచ్ఎస్ కార్యాలయాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలి

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటయ్యే 'సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్'(సీజీహెచ్ఎస్) రాష్ట్ర కార్యాలయాన్ని విశాఖలో కాకుండా అమరావతిలో ఏర్పాటు చేయాలని సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ) రాష్ట్ర పెన్షనర్ల సంఘం కోరింది. గుంటూరు కలెక్టరేట్ వద్దనున్న సీజీహెచ్ఎస్ కార్యాలయంలో సీజీహెచ్ఎస్ ఏడీ దండు పూర్ణచంద్రరావుని సీబీఐసీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం నాయకులు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా వినతిపత్రాన్ని సమర్పించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు సీజీహెచ్ఎస్ కొత్త కార్డుల దరఖాస్తులను హైదరాబాద్‌కు పంపే విధానానికి స్వస్తి పలికి, పాత విధానంలోనే వెల్నెస్ కేంద్రాలలో కొత్త కార్డులు మంజూరు, రెన్యువల్ చేయాలని కోరారు. పెన్షనర్లకు ఇండెంట్ ఔషధాలు పంపిణీ చేయని మెడికల్ షాపుల టెండర్లను తక్షణం రద్దు చేయాలన్నారు. వైద్య అనుమతులకు, పెన్షనర్ల కోసం మంగళగిరి ఎయిమ్స్‌లో ప్రత్యేకంగా డాక్టర్‌ను నియమించాలన్నారు. క్యాన్సర్, లివర్, గుండె జబ్బుల మందులు వెల్నెస్ సెంటర్లలోనే ఇచ్చేలా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వృద్ధులు, స్త్రీలు క్లినిక్‌కు రాలేని పరిస్థితుల్లో కుటుంబీకులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీబీఐసీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం నాయకులు వివేకానంద, గద్దె తిలక్, కోటేశ్వరరావు, గుమ్మడి సీతారామయ్య చౌదరి, వైద్యులు కోటేశ్వరరావు, తుకారాం, అయోషా, సునీల్, రామారావు, మురలి తదితరులున్నారు.

ఉచిత ఇసుకేదీ?

● ఎవరికి ఎప్పుడిచ్చారో చెప్పాలి ● జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం

(5వ పేజీ తరువాయి)

పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. జిల్లా పరిషత్ ద్వారా పదో తరగతి విద్యార్థులకు ప్రతి ఏటా సరఫరా చేస్తున్న స్టడీ మెటీరియల్ ఎప్పుడు ఇస్తారని ఎమ్మెల్సీ లక్ష్మణరావు ప్రశ్నించారు. డిసెంబరు 15 నాటికి అందజేస్తామని జడ్పీ ఛైర్‌పర్సన్ తెలిపారు. కాకుమాను సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు నీళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని, అనేక సందర్భాల్లో ఈ సమస్య గురించి మాట్లాడినా అధికారులు పరిష్కరించలేదని ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే రామాంజనేయులు ప్రస్తావించారు. జనవరి నాటికి సమస్యను పూర్తిగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అమరావతి, రెంటచింతల మండలాల్లో జడ్పీ హై స్కూల్ ఏర్పాటుపై సభ్యులు ప్రస్తావించారు. మాచర్ల నియోజకవర్గంలోని ఎత్తిపోతల, గిరిజన ఆవాస పాఠశాలల్లో సరైన వసతులు లేవని జడ్పీటీసీ తెలిపారు. నాడు-నేడు కింద పనులు పూర్తయినా ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయలేదని అమరావతి ఎంపీపీ అధికారులను నిలదీశారు.

వైద్యులు అందుబాటులో లేరు..

భట్టిప్రోలులోని ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు ఉన్నా ఒక్కరు కూడా ప్రజలకు అందుబాటులో ఉండరని జడ్పీ టీసీ తెలిపారు. నరసరావుపేట ఏరియా ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉండటంలేదని జడ్పీటీసీ ఓబుల్‌రెడ్డి తెలిపారు. మందులకు కొరత లేదని డీఎంహెచ్‌వో రవి చెప్పారు. అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గైనకాలజిస్ట్ సమస్య ఉందని, కనీసం ప్రతి నెల 9న అయినా ప్రత్యేక డాక్టర్‌ను నియమించాలని ఎంపీపీ కోరారు. అచ్చంపేట మండలం చింతపల్లిలో పీహెచ్‌సీ మంజూరైనా ఇంకా ప్రారంభించలేదని జడ్పీ టీసీ విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. పల్నాడు జిల్లాలో కొత్తగా 7 పీహెచ్‌సీలు మంజూరైనా వాటికి భవన నిర్మాణాలు, సిబ్బంది నియామకం జరగలేదని డీఎంహెచ్‌వో రవి సభ్యులకు చెప్పారు.

ప్రొటోకాల్ అంశంపై ఎమ్మెల్సీ లక్ష్మణరావు, రొంపిచర్ల జడ్పీటీసీ ఓబుల్‌రెడ్డి మాట్లాడారు. బాపట్లలో జరిగిన కౌలుదారుల వర్క్‌షాపునకు తనను ఆహ్వానించలేదని లక్ష్మణరావు అన్నారు. శిలాఫలకంపై ఎంపీపీ, జడ్పీటీసీ, కొన్ని సందర్భాల్లో జడ్పీ ఛైర్‌పర్సన్ పేరు కూడా లేకుండా స్థానికంగా ఉన్న అనామకుల పేర్లు వేస్తున్నారని పలువురు సభ్యులు ఆరోపించారు. ఇంతకు ముందే ఈ సమస్యను పల్నాడు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని అమరావతి ఎంపీపీ తెలిపారు. అధికారులు ఎమ్మెల్యేలు చెప్పినట్లే పనిచేయాలని, లేకుంటే వారిని బదిలీ చేయిస్తారని, ప్రొటోకాల్ విషయంలో అధికారులను బలిచెయ్యడం కన్నా కలెక్టర్లు చొరవ తీసుకుని ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ కోరారు.

సచివాలయాల్లో ఈగల మందలా ఉద్యోగులు

'సచివాలయాల్లో ఉద్యోగులు ఈగల మందలా ఉన్నా ఈ-క్రాప్ నమోదులో అలసత్వం వహిస్తున్నారని, ఆరు వేల మందికి కౌలు రైతులకు ఇంకా ఎందుకు ఇవ్వలేదని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిసెలు, కాల్వ గట్ల దగ్గర ఇళ్లు వేసుకుని నివసించే కౌలు రైతుల దగ్గరకు వెళ్లి పేర్లు నమోదు చేసి కార్డులు ఇవ్వాల్సిందేనని చెప్పారు. ఉద్యోగుల అలసత్వం వల్ల కౌలు రైతుల ప్రయోజనాలకు గండి పడుతుందన్నారు. సరైన సమయంలో వారికి రుణాలు ఇప్పించడంలో విఫలం అవుతున్నారన్నారు. కలెక్టర్లకు 50 శాఖల పైగా ఉంటాయని, వారు ఎన్ని కార్యక్రమాలు పర్యవేక్షిస్తారని ప్రశ్నించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు ఒక కలెక్టర్‌లా కింది స్థాయి సిబ్బందితో పనులు చేయించాలని సూచించారు.


సమావేశానికి హాజరై మాట్లాడుతున్న ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, మురుగుడు హనుమంతరావు, చంద్రగిరి ఏసురత్నం, కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నక్కా ఆనందబాబు

రసవత్తరంగా రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు

● 12 జట్లు.. 25వ తేదీ వరకు నిర్వహణ

కారంపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్ - 14 బాలబాలికల ఖోఖో పోటీలు కారంపూడి బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పోటీలను క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. మొత్తం 12 జట్లు పోటీల్లో పాల్గొననున్నాయి. ఈ నెల 25వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి.


శ్రీకాకుళంపై విజయం సాధించిన గుంటూరు జిల్లా జట్టు

శ్రీకాకుళంపై గుంటూరు జట్టు విజయం

శనివారం జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో గుంటూరు జట్టు శ్రీకాకుళం జట్టుపై 12-11 తేడాతో విజయం సాధించింది. విశాఖపట్నం జట్టు అనంతపురం జట్టుపై 17-15, ఈస్ట్‌గోదావరి జట్టు నెల్లూరు జట్టుపై 15-13, విజయనగరం జట్టు వెస్ట్‌గోదావరి జట్టుపై 14-7 తేడాతో గెలుపొందాయి. బాలికల విభాగంలో వెస్ట్‌గోదావరి జట్టు కర్నూలు జట్టుపై 10-6, విజయనగరం జట్టు నెల్లూరు జట్టుపై 6-3, అనంతపురం జట్టు కృష్ణా జట్టుపై 15-1, కడప జట్టు గుంటూరు జట్టుపై 9-7 తేడాతో గెలుపొందాయి. ఈ పోటీలను హెచ్‌ఎం రఘుబాబు, పీఈటీలు స్వర్ణరాజు శ్రీనివాసరావు, విద్యా కమిటీ ఛైర్మన్ బాలునాయక్, పూర్వ విద్యార్థి సంఘ నేత షేక్ మోదీన్‌సాలు పర్యవేక్షిస్తున్నారు.

రేపు పర్యావరణ సైన్స్ కాంగ్రెస్ : డీఈవో రేణుక

గుంటూరు(విద్య),నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్నత పాఠశాలల్లో చదివే ప్రభుత్వ/ప్రైవేటు స్కూల్స్ విద్యార్థులకు ఈనెల 25న పర్యావరణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహిస్తున్నట్లు డీఈవో సీవీ రేణుక శనివారం వెల్లడించారు. గుంటూరు నగరంలోని పాతబస్టాండు సెంటర్‌లోని పరీక్షా భవన్‌లో జరిగే జిల్లా స్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు విద్యార్థులు ప్రదర్శనలతో వచ్చేలా ఏర్పాట్లు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. చెత్త నుంచి సంపద తయారు చేయుట, పర్యావరణ కాలుష్యం తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశాలపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ షేక్ గౌసుల్‌మీరా(7842869407)ను సంప్రదించాలని ఈ సందర్భంగా డీఈవో సూచించారు.

రాజధాని రైతుల ప్లాట్లకు ఈ - లాటరీ

తుళ్లూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమరావతి నిర్మాణం కోసం స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతులకు గతంలో రిటర్నబుల్ ప్లాట్లను అందుకోని వారికి శనివారం ఈ లాటరీ విధానంలో ప్లాట్లను కేటాయించారు. శనివారం సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ - లాటరీ కార్యక్రమం జరిగింది. అడిషనల్ కమిషనర్ మల్లారపు నవీన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ - లాటరీ కి హాజరైన వారికి అడిషనల్ కమిషనర్ ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా లాటరీ తీశారు. కృష్ణాయపాలెం, నవులూరు - 1, 2, బోరుపాలెం, నెక్కల్లు, తుళ్ళూరు 1, 2, వెలగపూడి, మందడం - 1, 2, నిడమర్రు - 1, 2, అనంతవరం గ్రామాలకు సంబంధించి 37 మంది రైతులకు 120 రెసిడెన్షియల్, 49 కమర్షియల్ ప్లాట్లకు లాటరీ తీశారు. ఈ - లాటరీలో ప్లాట్లను పొందిన రైతులకు వాటిని అందించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ నవీన్ మాట్లాడుతూ, ప్రజారాజధాని అమరావతి నిర్మాణం కోసం రైతులు స్వచ్ఛందంగా ఇవ్వటానికి ముందుకు వస్తున్నారని తెలిపారు. భూ సమీకరణ విధానంలో సీఆర్‌డీఏకు భూములు ఇచ్చేందుకు సంసిద్ధతను తెలుపుతున్నారని చెప్పారు. అమరావతి నిర్మాణానికి భూములిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, రైతుల జీవన ప్రమాణాలు పెరుగుతాయని చెప్పారు. రిటర్నబుల్ ప్లాట్లను పొందిన రైతులకు రాజధానిలో మొత్తం తొమ్మిది రిజిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని, లాటరీలో ప్రొవిజినల్ సర్టిఫికెట్లు అందుకున్న వారం రోజుల లోపు ఆయా రిజిస్ట్రేషన్ కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ కూడా చేసుకోవచ్చునని చెప్పారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు దశలవారీగా రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించటం జరుగుతుందన్నారు.


ప్లాట్లు పొందిన మహిళా రైతుకు ప్రొవిజన్ సర్టిఫికెట్ అందజేస్తున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ నవీన్

మూడో రోజుకు విజయయాత్ర

● భక్తి శ్రద్ధలతో కృష్ణ యజుర్వేద భవన పూర్ణాహుతి, చంద్రమౌళీశ్వర స్వామి పూజ
● స్వామి వారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు

గుంటూరు(తూర్పు), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శృంగేరీ శారదా పీఠం 37వ విధుశేఖర భారతీ మహాస్వామి వారి విజయయాత్ర మహోత్సవం మూడో రోజుకు చేరింది. ఇందులో భాగంగా గుంటూరు మండల వేద ప్రవర్థక విద్వత్పరీక్షా సభ శతమానం ఉత్సవ వేద సభలు స్థానిక సంపత్‌నగర్‌లోని శృంగేరి శంకర మఠం, శారదా పరమేశ్వరి దేవస్థానంలో వైభవంగా జరిగాయి. జగద్గురు మహాస్వామి వారి దివ్య సన్నిధిన కృష్ణ యజుర్వేద భవన పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం సుమారు 150 మంది వేద పండితులకు వారి సతీమణులకు వేద సభలో స్వర్ణాలంకృత సత్కారాన్ని అందించారు. స్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పాదుకా పూజలు, భిక్షా వందనం, వస్త్ర కానుకలను అందించారు.

● స్వామిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

విధుశేఖర భారతీ మహాస్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట నారాయణ భట్టి, గుంటూరు పశ్చిమ, సత్తెనపల్లి, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు గల్లా మాధవి, కన్నా లక్ష్మీనారాయణ, బూర్ల రామాంజనేయులు దంపతులు దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

● పలు క్షేత్రాల సందర్శన

స్థానిక ఆర్ అగ్రహారంలోని వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని, సంపత్‌నగర్‌లోని రామనామ క్షేత్రాన్ని శనివారం విధుశేఖర భారతీ మహాస్వామి సందర్శించారు. దేవస్థాన వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. రామనామ క్షేత్రం ప్రాంగణంలోని నూతన పల్లకి, నూతన భవనంలో శంకరకృప వసతి సముదాయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


చంద్రమౌళీశ్వర స్వామి పూజ చేస్తున్న జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామి


విధుశేఖర భారతీ స్వామి ఆశీస్సులు పొందుతున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి

పశ్చిమ డెల్టాకాల్వకు 3506 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 3506 క్యూసెక్కుల సాగునీటిని శనివారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 11.6 అడుగుల నీటిమట్టం ఉంది. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 252 క్యూసెక్కుల నీరు, రేపల్లె కాల్వకు 522 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 57 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 51 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 119 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 1965 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

పోలింగ్ బూత్‌లు పరిశీలన

పెదనందిపాడు, నవంబరు, 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద శనివారం ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ సిబ్బంది ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ శంకరబాబు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఓట్లు నమోదు చేసే విషయంలో ఏ రాజకీయ పార్టీల నేతల ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా ఓటు నమోదు చేయాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు.

టీడీపీకి అండగా మాదిగలు : సర్పంచ్



మాదిగల కార్తీక సమారాధనలో పాల్గొన్న ఈమని, చిలువూరు సర్పంచులు, ఎంపీటీసీలు

దుగ్గిరాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు కట్టుబడిన టీడీపీకి మాదిగలు అండగా ఉంటారని ఈమని గ్రామ సర్పంచ్ సిద్దెల శ్రీవాణీఉజ్వలహరిణి అన్నారు. కేఆర్‌కొండూరు మహంకాళి అమ్మవారి ఆలయ పరిసరాల్లోని తోటల్లో టీడీపీ మాదిగల కార్తీక వనసమారాధన కార్యక్రమం శనివారం జరుపుకున్నారు. అనంతరం ఈమని గ్రామ టీడీపీ నాయకుడు చొప్పర రోశయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో హరిణి మాట్లాడుతూ మాదిగల సంక్షేమానికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్య, ఐటీ, మానవవనరుల శాఖామంత్రి నారా లోకేశ్‌లకు మాదిగలు ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. ప్రధానంగా మాదిగల శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. సర్పంచ్ చిలువూరు మాణిక్యం, ఎంపీటీసీ చిలువూరు రోజమరియమ్మ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కొండూరు ముత్తయ్య, చంటి, మాజీ సర్పంచ్ కుంపటి వెంకటరత్నం, పినపాటి కరుణాకర్, దేవరపల్లి చంటి, అద్దేపల్లి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ రోడ్డు నిర్మించాలని వినతి

మంగళగిరి సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు గ్రామంలో ఆర్‌సీఎం చర్చికి దారితీసే మార్గంలో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ సీపీఐ నేతలు శనివారం ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషాకు వినతి పత్రం అందజేశారు. ఆ మార్గంలో రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామానికి సంబంధించిన పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, జాన్ బాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులపై శ్రద్ధ అవసరం : ఎంఈవో

కాకుమాను, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి కేఏఫ్ కెన్నడీ అన్నారు. కాకుమాను రంగా నగర్ కాలనీలో ఎంపీపీ పాఠశాలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం డాక్టర్ అంబేడ్కర్ గురుకుల(బాలికల) పాఠశాలలో జరుగుతున్న అపార్(ఏపీఏఆర్) కేంద్రాన్ని ఎంఈవో -2 విజయ్‌భాస్కర్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆధార్ కార్డును అపార్‌తో అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి

పెదనందిపాడు, నవంబరు, 23 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు విక్రయించాలని ఏడీఏ వి.రామకోటేశ్వరి అన్నారు. మండలంలోని పలు పురుగు మందుల షాపులను శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, వ్యత్యాసాలను గుర్తించారు. అనుమతి పత్రాలు లేని పురుగు మందులు విక్రయించరాదని, కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. స్టాక్ బోర్డులో ప్రతిరోజూ నిల్వలు, ధరలు నమోదు చేయాలని డీలర్లకు సూచించారు.

25న మెగా వైద్యశిబిరం

దుగ్గిరాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మంచికలపూడిలో ఈనెల 25న వైఎంసీ యూత్, జీజీహెచ్, ఇవాంజికల్ ఫెలోషిప్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య పరీక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఇవాంజికల్ ఫెలోషిప్ ప్రతినిధి పెరవలి శివాజీ తెలిపారు. ఎ సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగు శిబిరాన్ని మంచికలపూడి, దుగ్గిరాల పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగించుకోవాలని, వైఎంసీ యూత్ మంచికలపూడి వెంకటేశ్వ రరావు, జయరావు విజ్ఞప్తి చేశారు.

కార్యకర్తలకు అండగా వైసీపీ

● నియోజకవర్గ సమన్వయకర్త వేమారెడ్డి

మంగళగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలతో ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి శనివారం సమావేశం నిర్వహించారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, ఎవరూ భయపడవలసిన అవసరం లేదని చెప్పారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపైనే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాలి తప్ప వ్యక్తిగత విమర్శలకు దిగవద్దని సూచించారు. ఏ అవసరం వచ్చినా తనను సంప్రదిస్తే అండగా నిలుస్తానని చెప్పారు.

అధ్వానంగా మండలపరిషత్ కార్యాలయ ఆవరణ

● పిచ్చి మొక్కలు.. మురుగు గుంతల మయం

● పట్టించుకోని పాలకవర్గం, అధికారులు



కంపచెట్లు, మురుగు గుంతలతో కార్యాలయ ఆవరణ



కార్యాలయాల ముందు పెరుగుతున్న పిచ్చి మొక్కలు

ప్రత్తిపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెట్లు పెంచి అందరికీ ఆదర్శంగా నిలవాల్సిన ప్రభుత్వ కార్యాలయం పిచ్చి తుమ్మ చెట్లతో నిండిపోయింది. ఒకటి కాదు.. రెండు కాదు... అనేక రకాల ప్రభుత్వ శాఖలు, కార్యాలయాలు ఉన్న ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం పిచ్చి మొక్కలతో.. మురికి గుంటలతో నిండిపోయింది. నిత్యం వందలాది మంది ప్రజలు సంచరించే ఈ ప్రాంగణాన్ని అటు పాలకవర్గం కానీ, ఇటు అధికారులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఫలితంగా పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో ఇప్పటికే అనేక ప్రభుత్వ కార్యాలయాలు కొలువు తీరి ఉన్నాయి. మండల పరిషత్ కార్యాలయంతో పాటు విద్యాశాఖ, అగ్రికల్చర్ టెస్టింగ్ ల్యాబ్, హౌసింగ్ కార్యాలయం, సచివాలయంతో పాటు వెలుగు, ఉపాధిహామీ పథకం కార్యాలయాలు కొలువు దీరి ఉన్నాయి. అలాంటి ఈ కార్యాలయ ప్రాంగణాన్ని అధికారులు పట్టించుకోవడమే మానేశారు. అప్పుడప్పుడు పాములు పలకరించి పోతున్నా వీరిలో మాత్రం మార్పు రావడం లేదు. గుంటూరు - పర్చూరు రహదారిలో ఈ కార్యాలయ సమూహం ఉంది. చుట్టూ పంట పొలాలు ఉన్నప్పటికీ వారు ఎప్పటికప్పుడు వారి పొలాలను శుభ్రంగానే ఉంచుకుంటారు. కేవలం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గడ్డితో పాటు పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి పోయి ఉన్నాయి. గతంలో కార్యాలయ ఆవరణలో అనేకమార్లు మంత్రుల, ఎమ్మెల్యేలు మొక్కలు నాటారు. కాని ఒక్క మొక్కను బతికించిన దాఖలాలు లేవు. దీనికి తోడు గత ప్రభుత్వ హయాంలో మట్టి తోలడం పేరుతో కార్యాలయం ముందు ప్రజలు కూర్చోవడానికి వీలుగా నీడనిచ్చే విధంగా ఉన్న పెద్ద పెద్ద వృక్షాలను సైతం కొట్టివేసి కొంత మేర మట్టి తోలారు. దానిని కూడా పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలి పెట్టారు. ఆవరణ గురించి ఎవరూ పట్టించుకోకుండా అలా వదిలి వేయడంతో మొత్తం పిచ్చి మొక్కలు మొలచి ఉంది. ఈ కార్యాలయ సముదాయాన్ని ఈ విధంగా పిచ్చి మొక్కలు పెంచుతూ ముళ్లపొదలుగా చేస్తున్నారు.

వీధి కుక్కల నియంత్రణ కేంద్రం ప్రారంభం



యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ అనురాధ

మంగళగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కాజ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వీధి కుక్కల నియంత్రణ కేంద్రాన్ని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో వీధి కుక్కల బెడదను స్థానిక నేతలు మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయించినట్టు తెలిపారు. ఎస్ఎస్ఈహెచ్ ద్వారా రూ.30 లక్షల వ్యయంతో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇకపై నియోజకవర్గంలో వీధి కుక్కల బెడద వుండదని చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో 6,750 వీధి కుక్కలు ఉన్నట్టు అంచనా వేయగా, వాటిని పట్టుకుని సెంటరుకు తరలించి ఆపరేషన్లు చేయించిన తరువాత తిరిగి అదే ప్రాంతంలో వదిలిపెట్టారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం కానీ, అప్పటి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కానీ నియోజకవర్గ ప్రజల సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా మాట్లాడుతూ మంత్రి లోకేశ్ ఆదేశాలతో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. అందుకోసం ఇద్దరు వెటర్నరీ డాక్టర్లు, కుక్కలను పట్టడానికి పది మంది సిబ్బందిని నియమించినట్టు చెప్పారు. ఈ కేంద్రంలో 108 కుక్కలు వుండేలా ఏర్పాట్లు చేయగా, ప్రతి రోజు 27 కుక్కలకు ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శేశకుంతల, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, జనసేన అధ్యక్షుడు అప్పికట్ల వెంకటరత్నం నాయుడు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మలినేనిలో ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం



శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వివిధ కళాశాలల అధ్యాపకులు

వట్టిచెరుకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక కళాశాలల్లో పాత తరహా బోధన, పాత విద్య అంశాలనే బోధిస్తున్నారని, దీనివల్ల పరిశ్రమలు ఆశించిన స్థాయికి విద్యార్థుల నైపుణ్యం చేరటం లేదని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ సీఈవో దాసరి రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని పుల్లడిగుంట గ్రామ సమీపంలో మలినేని లక్ష్మయ్య ఇంజనీరింగ్ కళాశాలలో ఆరు రోజులుగా జరుగుతున్న మైక్రో చిప్ ఎంబెడెడ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం శనివారం ముగింపు సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వివిధ కళాశాలల నుంచి పాల్గొన్న ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ డెవలప్‌మెంట్ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు నైపుణ్యాన్ని పెంచుకొని విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందింపచేయాలని సూచించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు మాట్లాడుతూ మెకానిక్, సివిల్, ఎలక్ట్రానికల్ వంటి ప్రముఖ ఇంజనీరింగ్ విభాగాల్లో అవకాశాలు తగ్గటంతో అందరూ కంప్యూటర్, సంబంధిత విభాగాల్లో ఎక్కువ అడ్మిషన్‌లు తీసుకుంటున్నారని, అది భవిష్యత్తుకు మంచిది కాదన్నారు. కార్యక్రమ కో-ఆర్డినేటర్ ఈసీఈ విభాగాధిపతి విజయసారథి, రిసోర్స్ పర్సన్ ప్రభు పాదసమల్ ప్రసంగించారు. మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మైక్రో చిప్ ఎంబెడెడ్ సిస్టమ్ ద్వారా విద్యార్థులకు నైపుణ్యాన్ని పెంపొందించటానికి అధునాతన సౌకర్యాలతో కూడిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు, డైరెక్టర్ దేవిరెడ్డి శ్రీనివాస కుమార్, డీన్ అకడమిక్ జంపని కిషోర్ బాబు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో పూర్వ విద్యార్థులకు అవార్డులు



పూర్వ విద్యార్థులు గార్లపాటి లత తల్లిదండ్రులను సత్కరిస్తున్న డాక్టర్ శ్రీకావ్య, రిజిస్ట్రార్ సుబ్బారావు

తాడేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని సామాజికంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడంతోపాటు ఆయా రంగాలలో ఉన్నతస్థాయికి చేరుకున్న పూర్వ విద్యార్థులను గుర్తించి వారికి వర్సిటీలోని పూర్వ విద్యార్థుల సంబంధ విభాగం ఆధ్వర్యంలో వివిధ అవార్డులు ప్రకటించారు. ఈ సందర్భంగా వారికి శనివారం వర్సిటీ ప్రాంగణంలోని న్యూ సెమినార్ హాల్లో జరిగిన సదస్సులో అవార్డులు ప్రదానం చేశారు. కన్వీనర్ డాక్టర్ సీహెచ్ శ్రీకావ్య మాట్లాడుతూ తమ వర్సిటీలో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న విద్యార్థులందరికి అభినందనలు అన్నారు. కాగా మెకానికల్ ఇంజనీరింగ్ చదివి అమెరికాలో డేటా సెంటర్ డైరెక్టర్‌గా స్థిరపడిన గార్లపాటి లత తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. రిజిస్ట్రార్ సుబ్బారావు మాట్లాడుతూ కేఎల్‌యూ ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ డాక్టర్ కె.సోని, ఐక్యూఏసీ డీన్ రామకృష్ణ, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ హబిబుల్లాఖాన్, ప్రో చాన్సలర్ జగన్నాధరావు, వీసీ సారధివర్మ, ప్రోవీసీలు రాజశేఖరరావు, వెంకట్రామ్, ప్రసాద్, ఆర్‌అండ్‌డీ అడిషనల్ డీన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయంగా మార్మోగుతున్న జగన్ అవినీతి చరిత్ర

● టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లా వీరయ్య చౌదరి, మాజీ ఎంపీపీ రాంగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న కొల్లా వీరయ్య చౌదరి, మండల టీడీపీ నాయకులు

కాకుమాను, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జగన్ అవినీతి చరిత్ర అంతర్జాతీయంగా మార్మోగుతుందని టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లా వీరయ్య చౌదరి, మాజీ ఎంపీపీ రాంగోపాల్ విమర్శించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ మండల కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులెత్తించారని, యువతను ఐటీ రంగంలో అగ్రగాములుగా నిలిపి దేశ, విదేశాలలో వారికి ఉజ్వల భవిష్యత్ కల్పించారని అన్నారు. జగన్ వేల కోట్లు అవినీతి కేసుల్లో జైలుకు వెళ్లి సీఎంగా కల్పించిన అవకాశాన్ని దుర్వినియోగం చేసి అప్పుల రాష్ట్రంగా మార్చారని దుయ్యబట్టారు. తాజాగా అదాని సంస్థల నుంచి రూ.1750 కోట్లు లంచం స్వీకరించినట్లు అమెరికా కోర్టులో అక్కడ ప్రభుత్వ సంస్థలు చార్జి షీటు దాఖలు చేయడం జగన్ అవినీతి చరిత్రకు అద్దం పడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో నక్కల అగస్టీన్, నల్లమోతు పూర్ణ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలి

● సీపీఐ ఏరియా కార్యదర్శి చిన్ని తిరుపతయ్య

మంగళగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ నివేశన స్థలాలు ఇవ్వాలని సీపీఐ ఏరియా కార్యదర్శి చిన్ని తిరుపతయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని ఇందిరానగర్ సచివాలయం వద్ద అర్జీదారులతో కలిసి నివేశన స్థలాల కోసం వినతులు అందజేశారు. తిరుపతయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణంలో రెండు సెంట్లకు తగ్గకుండా ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి కనీసం రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం నిరుపయోగమైన ప్రాంతంలో నివేశన స్థలాలు మంజూరు చేసి పేదలను మోసం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి బ్రహ్మేశ్వర రావు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో విత్తన శుద్ధి ముఖ్యం

వట్టిచెరుకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ సాగులో ఏ పైరునైనా విత్తడానికి ముందు ఆయా పైర్లకు ఉపయోగించే విత్తనాలు శుద్ధి చేయటం ద్వారా పైరు నాణ్యత, ఉత్పత్తి, దిగుబడులపై ప్రభావం ఉంటుందని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. గ్రామ సెంటర్‌లో విత్తన శుద్ధి చేసే విధానాన్ని శనివారం రైతుల సమక్షంలో నిర్వహించారు.

శతాధిక వృద్ధురాలు సుగుణమ్మ మృతి



సుగుణమ్మ (ఫైల్)

తాడికొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాడికొండ మండలం కంతేరు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కె.సుగుణమ్మ (104) శనివారం మృతి చెందారు. వృద్ధాప్యంలో కూడా సుగుణమ్మ తన పనులు తానే చేసుకుంటూ ఒకరిపై ఆధారపడకుండా జీవించి అందరికీ ఆదర్శంగా నిలిచారని కుటుంబసభ్యులు తెలిపారు. సుగుణమ్మ పెద్ద కుమారుడు పెద్ద నాగేశ్వరరావు, మనుమడు మహేష్ సర్పంచ్‌లుగా గ్రామానికి సేవలందించారు. సుగుణమ్మకు గ్రామస్థులు నివాళులు అర్పించారు.

మరుగుదొడ్లను పరిశీలించిన ఎంపీడీవో

ఫిరంగిపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురం గ్రామంలోని సచివాలయం-1 వద్ద ఉన్న సీఎస్‌సీ సామూహిక మరుగుదొడ్లను మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, కో-ఆర్డినేటర్ వేల్పుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయాలి.. ప్రజాసంఘాల విస్తృత ప్రచారం

మంగళగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26వ తేదీన గుంటూరులో జరిగే ధర్నా, ప్రదర్శన జయప్రదం చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల కారణంగా ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నారని నేతలు ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ అంశంపై మాట్లాడడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ (న్యూ) నేత కూరపాటి కోటేశ్వరరావు, సీఐటీయూ నేతలు పిల్లలమర్రి బాలకృష్ణ, చెంగయ్య, రాఘవులు, బాలాజీ పాల్గొన్నారు.

అదానిని వెంటనే అరెస్టు చేయాలి

తాడేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అవినీతి కేసులో అడ్డంగా అమెరికాలో దొరికిపోయిన పారిశ్రామికవేత్త అదానిని వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. ఉండవల్లి సెంటర్లో రాజధాని డివిజన్ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం జరిగిన నిరసన కార్యక్రమంలో రామారావు మాట్లాడుతూ అదాని చేసిన అవినీతితో ఆంధ్రప్రదేశ్ అతలాకుతలమైందని, ప్రజలు తీవ్ర నష్టాన్ని చవిచూసి ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. ఈ ప్రక్రియ అంతటికి మూల కారణమైన అదానితో సహా ఇతర వ్యక్తులను గుర్తించి ఎంతటివారైనా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం.రవి, ఈమని రామారావు, గాంధి, బక్కిరెడ్డి, వెంకటేశ్వర్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అదానీ ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలి

● సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బైరగాని శ్రీనివాసరావు

ఫిరంగిపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అదానీ గ్రూపు రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలన్నింటిని వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బైరగాని శ్రీనివాసరావు అన్నారు. ఫిరంగిపురంలో సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం గ్రామంలోని సత్తెనపల్లి బస్టాప్ సెంటర్‌లో సీపీఎం మండల కమిటీ సభ్యులు నిరసన తెలిపారు. విశాఖ డేటా సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని, అదానికి కేటాయించిన భూములను, ప్రజల సంపదను వెనక్కి తీసుకురావాలని, రూ.1750 కోట్లు లంచం తీసుకున్న అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, మండల నాయకులు వెంకటరెడ్డి, మార్పుల హోప్‌మెన్, ఆకారపు అంకమరావు, జీ వెంకటేశ్వరరావు, సీహెచ్ రామారావు పాల్గొన్నారు.

ఏసీసీ కార్మికుల దీక్షకు కాంగ్రెస్ నేతల సంఘీభావం

తాడేపల్లి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారంతో 28వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కార్మికుల దీక్షా శిబిరం వద్దకు విచ్చేసి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి షేక్ సలీం ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ సిమెంటు కంపెనీ కార్మికులకు న్యాయంగా రావాల్సిన నష్టపరిహారం వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. కార్మికులను ఇబ్బంది పెడుతూ యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, మంత్రి లోకేశ్ స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమస్యను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి దృష్టికి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలకా విజయకుమార్ దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు షేక్ సలీం, దర్శనపు శామ్యూల్, పఠాన్ సుభాని, రేమిడిశెట్టి హనుమంతరావు, కె.కృష్ణచౌదరి, ఆర్ల వెంకటస్వామి, బుల్లా సమర్పణకుమార్, ఖలీల్, స్థానిక సీఐటీయూ నేతలు, వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, కూరపాటి స్టీవెన్, ఐఎఫ్‌టీయూ యూనియన్ నాయకులు ఆదినారాయణ, స్థానిక మహిళలు పాల్గొన్నార

టీడీపీ సభ్యత్వంతో ఎన్నో ప్రయోజనాలు

● టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని



సభ్యత్వ నమోదులో పాల్గొన్న పోతినేని శ్రీనివాసరావు, కార్యకర్తలు

మంగళగిరి సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఒనగూరుతాయని టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు చెప్పారు. మంగళగిరిలోని టిడ్కో గృహ సముదాయంలో జరుగుతున్న సభ్యత్వ నమోదును శనివారం రాత్రి ఆయన పరిశీలించారు. టిడ్కో సముదాయంలో వెయ్యికి పైగా సభ్యత్వాలను నమోదు చేయడంపై నేతలు, కార్యకర్తలను అభినందించారు. రూ.వంద చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల ప్రమాద బీమా, పిల్లల చదువులకు ఆర్థికసాయం, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో మార్పులకు అర్జీల స్వీకరణ



ఓటర్ల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అసిస్టెంట్ సీఈవో తాతబ్బాయ్

మంగళగిరి సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద రెండు రోజులపాటు జరిగే ఓటర్ల జాబితా సవరణ క్యాంపులు శనివారం ప్రారంభమయ్యాయి. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవెల్ అధికారులు ముసాయిదా ఓటర్ల జాబితా-2025ను ఓటర్లకు అందుబాటులో ఉంచారు. ఓటరు జాబితాలో మార్పు, చేర్పులు, కొత్త ఓట్ల నమోదు, మరణించిన వారి ఓట్ల తొలగింపు, పోలింగ్ బూత్ మార్పు కోసం ఓటర్ల అర్జీలను సమర్పించారు. నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి ఎ.లక్ష్మీకుమారి, సీఈవో కార్యాలయం అధికారులు కే.అబ్దుల్ అలీమ్, తాతబ్బాయ్ తదితరులు పోలింగ్ కేంద్రాల వద్ద క్యాంపులను పరిశీలించారు.

స్మార్ట్ డెలివరీ సిస్టమ్స్‌తో రోగులకు నాణ్యమైన చికిత్స



ఈ-పోస్టర్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన అతిథులు

తాడికొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ డెలివరీ సిస్టమ్స్‌తో రోగులకు నాణ్యమైన చికిత్సను అందించవచ్చునని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జువాలజీ, ఆక్వాకల్చర్ విభాగపు ప్రొఫెసర్ పీ పద్మావతి అన్నారు. శనివారం లాం చలపతి ఫార్మసీ కళాశాలలో బ్రేకింగ్ జూనియర్స్ నావెల్ అప్రోచెస్ ఇన్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్ అనే అంశంపై స్మార్ట్ డెలివరీ సొల్యూషన్స్ నావిగేటింగ్ ఫిజియోలాజికల్ బారియర్స్ విత్ రెస్పాన్సివ్ సిస్టమ్స్ అనే శీర్షికపై జాతీయ స్థాయి ఈ-పోస్టర్ పోటీలను నిర్వహించారు. ప్రొఫెసర్ పద్మావతి మాట్లాడుతూ స్మార్ట్ డెలివరీ సిస్టమ్స్ అధునాతన సాంకేతికతతో శారీరక వాతావరణం మార్పులకు ప్రతి స్పందిస్తూ లక్ష్య ప్రాంతాలకు ఔషధాలను సరిగ్గా చేరుస్తాయని తెలిపారు. జాతీయ స్థాయి ఈ-పోస్టర్ పోటీలకు 20 కళాశాలల నుంచి 244 ఈ-పోస్టర్లను ప్రదర్శించారు. పోటీలలో మొదటి ఐదుగురు విద్యార్థులకు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఏఈటీ ల్యాబ్స్ జనరల్ మేనేజర్ ఎం.సంతోష్‌కుమార్, ప్రిన్సిపాల్ రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహాల ఆవిష్కరణకు ఎంపీ పెమ్మసానికి ఆహ్వానం



గుంటూరులో ఎంపీ పెమ్మసానిని కలిసిన టీడీపీ నేతలు

తుళ్లూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తుళ్లూరులో ఎన్టీఆర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని టీడీపీ నేతలు శనివారం గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఆహ్వానించారు. ఎంపీ ఇచ్చే తేదీని బట్టి కార్యక్రమం ఏర్పాటు చేసుకుంటామని నేతలు అన్నారు. తుళ్లూరులోని ఐనచెరువు, సినిమాహాలు సెంటర్, లైబ్రరీ సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహాలు ఆవిష్కరణకు సిద్ధం చేశారు. ఎంపీని కలిసిన వారిలో మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ కిరణ్, తాడికొండ నియోజకవర్గ ఆర్టీఎస్ కోఆర్డినేటర్ నెలకుదిటి చందు, నాయకులు జమ్ముల అనిల్, పాటిబండ్ల జయకృష్ణ, హరికిరణ్(బాబి) దొండపాడు సుభాకర్ తదితరులున్నారు.

టూ టౌన్ సీఐగా రామ్‌నాయక్ ?

తెనాలి అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెనాలి రెండవ పట్టణ పోలీసు స్టేషన్ సీఐగా రామ్‌నాయక్‌ను పోలీసు ఉన్నతాధికారులు నియమించినట్లు సమాచారం. ప్రస్తుతం పని చేస్తున్న సీఐ నిస్సార్ అహ్మద్ విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ అయ్యారు. కొత్త సీఐ ఆదివారం బాధ్యతలు తీసుకోనున్నారు.

తోట శ్రీను మృతి

టీడీపీకి తీరని లోటు

చేబ్రోలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకుడు తోట శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని సుద్ధపల్లికి చెందిన తోట శ్రీనివాసరావు శనివారం మృతి చెందారు. మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు గ్రామానికి వెళ్లి శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మృతురాలికి నివాళి

పొన్నూరుటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉప్పరపాలెంకి చెందిన తెలుగుదేశం పార్టీ సానుభూతిపరురాలు తాడిశెట్టి పుష్పవతి శనివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు ఆ గ్రామానికి వెళ్లి పుష్పవతి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పుష్పవతి కుమారుడు, టీడీపీ నాయకుడు తాడిశెట్టి దుర్గారావును పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబురావు, బొద్రు రామారావు, చల్లశెట్టి సీతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

14న లోక్ అదాలత్

పొన్నూరుటౌన్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సివిల్ కోర్టులో డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తునట్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎం అంజనీ ప్రియదర్శిని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీపడదగిన క్రిమినల్, సివిల్ కేసులు, మనోవర్తి, చెక్ బౌన్స్, ప్రిలిటిగెంట్ కేసులను పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కక్షిదారులకు సూచించారు.

భూ యజమానులు

రీసర్వేకు సహకరించండి

తెనాలి మారీసుపేట,నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని భూ యజమానులు రీ సర్వేకు సహకరించాలని పట్టణ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శనివారం ఒక ప్రకటణలో కోరారు. ఈనెల 26 నుంచి భూరీ సర్వేను ప్రారంభిస్తున్నామని తెలిపారు. భూయజమానులు (భవన, ఖాళీస్థలము, వ్యవసాయం, వ్యవసాయేతర) రీ సర్వేకు సచివాలయ సిబ్బందికి సహకరించాలన్నారు. రీ సర్వే పూర్తయిన తర్వాత భూయజమానులకు ఆస్తికి సంబంధించిన భూహక్కు పత్రం జారీ చేస్తామని కమిషనర్ తెలిపారు.

ట్రాఫిక్ సమస్యలను

పరిష్కరించండి

తెనాలిమారీసుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నాలుగు కూడళ్లలో ట్రాఫిక్ సమస్య జఠిలంగా ఉంది. నిత్యం వేలాదిమంది వాహన దారులు పట్టణానికి తమ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఈ క్రమంలో నాలుగు వరుసల రోడ్డులో సరైన సిగ్నలింగ్ వ్యవస్థ లేకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా వస్తు ట్రాఫిక్ సమస్యలను సృష్టిస్తున్నారు. ముఖ్యంగా రైల్వే స్టేషన్ రోడ్డులో రోజు ఉదయం సాయంత్రం వేళలలో ఆటోలు, లారీలు, ద్విచక్ర వాహనదారులు, విద్యాసంస్థల వాహనాలు రాకపోకలతో తీవ్ర రద్దీ ఏర్పడుతోంది. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. ఆయా సమయంలో పాఠశాలలకు, కళాశాలలకు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాయాలకు వెళ్లేవారిరు తీవ్ర అసౌకర్యానికి గురతువున్నారు. ఈ ట్రాఫిక్ సమస్యపై అధికారులు వెంటనే స్పందించి తగు పరిష్కారాన్ని చూపాలని ప్రజలు కోరుతున్నారు.

పేదలకు వరం 'సీఎం సహాయ నిధి'

- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ వెల్లడి
- పలువురి లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పెదకాకాని, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స చేయించుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందిపడే పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరమని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. సీఎం సహాయ నిధి నుంచి పలువురి లబ్ధిదారులకు మంజూరైన నగదు చెక్కును శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పెదకాకాని మండలం పెదకాకాని గ్రామానికి చెందిన కానుగంటి లక్ష్మికి రూ. 3,50,000, షిప్రా దాస్‌కి రూ. 52,205, నంబూరు గ్రామానికి చెందిన చెందిన నేలపాటి నాగేశ్వరమ్మకి రూ.1,03,226, రామచంద్రపాలెం గ్రామానికి చెందిన గోగినేని వెంకట సుబ్బమ్మకి రూ.1,62,000, తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన కడియాల పూర్ణచంద్రరావుకి రూ.36,765, ఉప్పలపాడు గ్రామానికి చెందిన మున్నంగి సాంబశివరావుకి రూ.53,592 సీఎం సహాయనిధి నగదు మంజూరుకాగా వారిని చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ఎంతో ఖర్చుతోకూడిన చికిత్స చేయించుకోవటం ఆర్థికంగా తమకు ఎంతో కష్టతరమని, ఆ సందర్భంలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌ని కలిసి సాయం కోరగా, వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా తమకు ఆర్థికసాయం అందేలా చేశారని, ఆయన చేసిన సాయాన్ని ఎప్పటికీ మర్చిపోమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల నేతలు పాల్గొన్నారు.

'ఎన్టీఆర్ పించన్'తో అవ్వాతాతలకు భరోసా

- పింఛన్ పంపిణీలో నూతన ఒరవడికి శ్రీకారం
- మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి

తెనాలిరూరల్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అందజేస్తున్న ఎన్టీఆర్ భరోసా పించన్ అవ్వాతాతలకు మరింత భరోసాని ఇస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పించన్ తీసుకునే కుటుంబ యజమాని అనివార్యకారణాల వలన మృతి చెందితే అతడికి అందించే ఎన్టీఆర్ భరోసా పించను సొమ్మును భార్యకు వర్తించేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు నూతన విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. పించన్ పొందే వ్యక్తి మృతి చెందితే అతని కుటుంబంలో భార్య పేరు నమోదు చేసుకుని నవంబరు 15వ తేదీ లోపు వారి వివరాలను పరిశీలించి డిసెంబరు 1 నాటికి పించను నగదు అందేలా ప్రభుత్వం బాధ్యత తీసుకుందన్నారు. గత ప్రభుత్వం పించన్ పెంచి ఇస్తానని చెప్పి దాదాపుగా ఐదేళ్లపాటు పాటు కాలయాపన చేసి చివరికి అవ్వాతాతలను ఉసూరుమనిపించిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం పేదల అభ్యున్నతికి పాటుపడుతోందని, మరీ ముఖ్యంగా వృద్ధులకు భరోసాగా నిలువాలన్న లక్ష్యంతో పించన్ విధానాన్ని మరింత సులభతరం చేసిందని మనోహర్ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం అనేక మంచి కార్యక్రమాలతో ముందుకు సాగుతామని ఈ సందర్భంగా మనోహర్ పేర్కొన్నారు.



వృద్ధులకు పండ్లను పంపిణీ చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్స్

రక్తదానంపై అవగాహన

తెనాలి మారీసుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెంచుపేటలోని జేఎంజే కళాశాలలో 10వ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ గుంటూరు, జేఎంజే కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో 76వ ఎన్‌సీసీ డేను ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ శారద పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన గ్లోబల్ స్కూల్ ఇంగ్లీష్ అధ్యాపకులు జీ. జీవన్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, గుండె శస్త్ర చికిత్సలకు, అవయవ మార్పిడికి, రోడ్డు ప్రమాదాల గురైన వ్యక్తులకు రక్తం ఎంతో అవసరమౌతుందన్నారు. రక్తదానంపై ప్రజలలో ఉన్న అపోహలను తొలగించాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కే.నిర్మలజ్యోతి, జీ.హెస్తేరు రాణి, కే.అరుణ సుజాత పాల్గొన్నారు. అలాగే స్థానిక చెంచుపేటలోని శబరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, స్వీట్స్‌ను పంపిణీ చేశారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలు

- త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు
- ఆటో యూనియన్ నేతలకు పలు సూచనలు

తెనాలి మారీసుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు తెలిపారు. శనివారం స్థానిక పాత బస్టాండ్, రైల్వే వంతెన ప్రాంతాలను ట్రాఫిక్ ఎస్ఐ రాజ్యలక్ష్మితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డుకు అడ్డంగా ఆటోలు నిలిపి ఉండటాన్ని గమనించి.. ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా ఆటోలను నిలుపుకోవాలని యూనియన్ నేతలకు సూచించారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని ప్రజలనుండి తరచుగా ఫిర్యాదులు అందుతున్నాయని, సమస్య జఠిలం కాకుండా జాగ్రత్త వహించాలని వారికి సూచించారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా తగిన ఏర్పాట్లు చేయను న్నట్లు సీఐ రమేష్‌బాబుతెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటో యూనియన్ నేతలు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపు చర్యలను పర్యవేక్షిస్తున్న రాధిక తదితరులు

తెనాలి మారీసుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పర్యవేక్షణలో మున్సిపల్ అధికారులు శనివారం వార్డులలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. 17వ వార్డులో అక్రమ కట్టడాలను, డ్రెయిన్‌ల ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు డ్రెయిన్‌లను, మురుగు కాల్వలను ఆక్రమించరాదని, ఆక్రమించి కట్టడాలను నిర్మిస్తే తొలగిస్తామని హెచ్చరించారు. అనంతరం 19వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, ఇన్‌చార్జి ఏఈ కళ్యాణ్, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలి



డాక్టర్ విద్యాధర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

తెనాలి అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజల ఆరోగ్య సమస్యలపై ఫార్మసిస్టులు అవగాహన కల్పించాలని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యదేవర విద్యాధర్ సూచించారు. బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో జాతీయ ఫార్మసీ ఉత్సవాల ముగింపు వేడుకలను శనివారం నిర్వహించారు. ఏఎస్ఎన్ ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మారుమూల గ్రామాల్లో నివసించే ప్రజలకు వైద్య రంగంపై అవగాహన ఉండదనీ, ఆయా గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనారోగ్య సమస్యల నివారణచర్యలపై ప్రజలను చైతన్యయుతం చేయాలన్నారు. ఐపీఏఎస్ఎఫ్ చైర్ పర్సన్ ఇళ్ళా ప్రజ్ఞ మాట్లాడుతూ ఫార్మసిస్టులు తమ కెరీర్‌ను సవాల్‌గా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెంటార్స్ నందగోపాల్‌కృష్ణ, భార్గవి, సునీల్, జ్యోతిబసు, కళ్యాణ చక్రవర్తి ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో

నష్టపోతున్న ఓబీసీలు

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన



గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేశన శంకరరావు

పెదకాకాని, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణ పేదలకు ఇస్తున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో అతి తక్కువ మార్కులతో విద్యాలయాలలో సీట్లు, ఉద్యోగాలను పొందడం వలన అణగారిన రిజర్వేషన్ వర్గాలు, ముఖ్యంగా ఓబీసీలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పెదకాకానిలోని సర్దార్ గౌతులచ్చన్న విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలు విద్యా ఉద్యోగ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చూపకపోయినా రిజర్వేషన్ల కారణంగా ప్రవేశాలు పొందే వారని, దీంతో ప్రతిభ దెబ్బతిం టుందని ఆధిపత్యకులాల వారు అపవాదులు వేసేవారన్నారు. కానీ నేడు అగ్రకుల పేదలు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ద్వారా, గత రిజర్వేషన్ వర్గాల కంటే అతి తక్కువ మార్కులతో విద్య, ఉద్యోగాలలో ప్రవేశాలు పొందుతున్నారన్నారు. ప్రతిభ ఎవరి సొత్తు కాదన్న సత్యాన్ని అగ్రకుల పెత్తందారీ వర్గాలు గుర్తించాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన అగ్రకుల పేదలకు బడ్జెట్ లో తగినన్ని నిధులు కేటాయించి ఆదుకోవాలేగానీ, రిజర్వేషన్ల సామాజిక ఉద్దేశాన్ని, అవసరాన్ని విస్మరించరాదన్నారు. మెరిట్ మార్కులు సాధించిన బీసీ, ఎస్సీఎస్టీ అభ్యర్థులు ఓపెన్ కేటగిరిలో పోస్టులు పొందే జీవో 55ను రద్దుచేసి, మెరిట్ మార్కులు పొందిన వీరిని కూడా రిజర్వేషన్ కేటగిరీ పోస్టులతో భర్తీచేసే జీవో 29ను అమలు చేయటం ద్వారా రిజర్వేషన్ వర్గాలకు, ముఖ్యంగా బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అందుకే జీవో 29 రద్దుచేసి, పాత జీవో 55 అమలు చేయాలని కేసన శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలి



మానవహారంగా నిల్చున్న విద్యార్థులు

చేబ్రోలు,నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ పారిశుద్ధ్యం అమలులో భాగంగా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు ఏర్పాటు చేసుకోవాలని గొడవర్రు సర్పంచ్ బీరం జానకీదేవి అన్నారు. మండల పరిధిలోని గొడవర్రులో శనివారం 'మన టాయిలెట్ మన గౌరవం'పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులతో మానవహారం నిర్మించి గ్రామస్తులకు మరుగుదొడ్లపై అవగాహన కల్పించారు. డిసెంబరు 10న టాయిలెట్ డే ను పురస్కరించుకొని ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల కొఆర్డినేటర్ జీ ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.

26న గుంటూరులో

బహిరంగ సభ

చేబ్రోలు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న గుంటూరులో తలపెట్టిన నిరసన ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీ నారాయణ కోరారు. చేబ్రోలులో పలు కార్మిక యూనియన్లతో శనివారం ఆయన సమావేశం నిర్వహించి, బహిరంగ సభ గురించి తెలియజేసి వారి మద్దతు కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు సీహెచ్ హనుమంత్ ప్రసాద్, మంజుల, రాఘవమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తులతో రైతుకి లాభం

డాక్టర్ వై.పద్మావతి
పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్





డాక్టర్ వై.పద్మావతి
పశుసంవర్ధక శాఖ
డిప్యూటీ డైరెక్టర్

తెనాలి క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పాడి పంట సమృద్ధిగా ఉంటేనే రైతు సంతోషంగా ఉండగలడు. పాల ఉత్పత్తులతో రైతుకి ఎంతో లాభం ఉంటుందని పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వై.పద్మావతి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశు పోషకుల కోసం ఎలాంటి పథకాలు అమలు చేస్తున్నాయో తెలుసుకోవడం కోసం డాక్టర్ పద్మావతితో ఆంధ్రజ్యోతి ప్రతినిధి 'ఫటాఫట్..'

ప్ర: మేలు జాతి గేదెల సంతతి అభివృద్ధికి ఏం కృషి జరుగుతోంది?

జ : గ్రామాల్లో నాటు గేదెలు లేవు. ఎక్కువగా అధిక పాల దిగుబడిని ఇచ్చే ముర్రే జాతి గ్రేడింగ్, గేదెలు, ఉత్తమ జాతి పశువులనే రైతులు పోషిస్తున్నారు. ఉత్తమ పశు సంపద అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై కృత్రిమ గర్భోత్పత్తి విధానంలో ట్రిబుల్ ఎస్ సెమన్‌ను మేలుజాతి గేదెలకి చేసినట్లయితే 90 శాతం పెయ్యి దూడల సంతతి లభిస్తుంది. దీనికి ప్రభుత్వం రూ.10 వేల వరకు సబ్సిడీ కింద అందిస్తుంది. మన రాష్ట్రంలో ఉత్పత్తి చేస్తున్న ట్రిబుల్ ఎస్ సెమన్ ఉత్తమ సెమన్‌గా దేశంలో రెండో స్థానంలో ఉంది.

ప్ర: గేదెలలో వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

జ: బ్యాక్టీరియా వలన వచ్చే సమస్యలకు 4-8 నెలల వయసు దూడలకు బ్రూసెల్లా టీకాలు వేయించాలి. పొదుగు వ్యాధులు సోకకుండా చావిడిలో శుభ్రం పాటించాలి. దూడలకు జున్నుపాలు తప్పనిసరిగా వదలాలి. శాస్త్రీయ పద్ధతిలో పశుపోషణ జరగాలి.

ప్ర: హర్యానా ముర్రే జాతి గేదెలు ఇక్కడ లాభదాయకంగా ఉంటాయా?

జ: అక్కడి ముర్రే జాతి గేదెలు ఇక్కడి వాతావరణం, దాణాకి తట్టుకోలేవు. మనకు గ్రేడెడ్ ముర్రా జాతి గెదేలే లాభదాయకంగా ఉంటాయి.

ప్ర: నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ పథకం గేదెలకు వర్తిస్తుందా?

జ: ఆ పథకం గెదెలకు వర్తించదు, కోళ్ళు, చేపలు, పందులు పెంపకానికి మాత్రమే వర్తిస్తుంది.

ప్ర: పాల ఉత్పత్తి పెంచడానికి, వ్యాధుల నివారణకు ఏ చర్యలు తీసుకుంటారు?

జ: పాల ఉత్పత్తులు పెంచటానికి సబ్సిడీపై పశుదాణా అందించడం జరుగుతుంది. వ్యాధుల నివారణ, ప్రతి నియోజకవర్గంలో ల్యాబ్ మొబైల్ వెటర్నరీ క్లినిక్‌లు అందుబాటులో పశువైద్యశాలలు, గ్రామాల్లో పశు వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

ప్ర: రాష్ట్ర ప్రభుత్వం పశు పోషకులకు అందిస్తున్న పథకాలు?

జ: ప్రస్తుతం సబ్సిడీ ధరలో గోకులాల నిర్మాణం, ఎన్ఆర్‌జీఎస్ పథకం ద్వారా పశుగ్రాసం వంటి వాటిని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది.

నేడు మార్కెట్ యార్డులో

కాపు కార్తీక వనసమారాధన

తెనాలి అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ యార్డులో ఆదివారం డివిజన్ కాపు కార్తీక వన సమారాధన జరుగుతుందని సంఘ నాయకులు తెలిపారు. శనివారం యార్డులో జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సదర్భంగా కాపు నేతలు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా తామంతా ఐక్యంగా సమారాధన నిర్వహిస్తున్నామన్నారు. ఎంతో మంది దాతలు సమారాధనకు చేయూత అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వైద్యశిబిరం నిర్వహిస్తామని, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని డివిజన్‌లోని కాపులంతా పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తోటకూర రమణరావు, హరిదాసు గౌరీశంకర్, గ్యాలం వేణు, సుబ్రహ్మణ్యం, యశ్వంత్, మురళి, వాసు, అజయ్, రమేష్, కోటేశ్వరరావు, మహేష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలతో

రైతులకు ఎంతో మేలు

తెనాలిరూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో కనీస మద్దతు ధరలతో ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు మేలు జరిగేలా చూడాలని తెనాలి, చేబ్రోలు మండలాల వ్యవసాయాధికారులు జీ. ప్రేమసాగర్, శ్రీనివాసనాయక్‌లు సూచించారు. శనివారం వ్యవసాయ మార్కెట్‌యార్డులో వ్యవసాయశాఖ, సివిల్ సప్లయి శాఖ ఆధ్వర్యంలో గ్రామ, మండల స్థాయి అధికారులతో ధాన్యం కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో ప్రేమసాగర్ మాట్లాడుతూ ధాన్యం అమ్మదలచిన రైతులు రైతు సేవా కేంద్రాలలో వివరాలను నమోదు చేయాలన్నారు. శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ ధాన్యం మద్దతు ధర 75 కేజీలకు గ్రేడ్ ఎ రకానికి రూ.1740గా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమంలో తెనాలి, చేబ్రోలు మండలాల గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

25న పర్యావరణ సైన్స్ కాంగ్రెస్

గుంటూరు(విద్య),నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్నత పాఠశాలల్లో చదివే ప్రభుత్వ,ప్రైవేటు స్కూల్స్ విద్యార్థిని విద్యార్థులకు ఈనెల 25న గుంటూరు నగరంలోని పాతబస్టాండు సెంటర్ వద్దగల పరీక్షా భవన్‌లో జిల్లా స్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహిస్తున్నట్లు డీఈవో సీవీ రేణుక శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగించుకోవాలి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

కొల్లిపర,నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలని వైద్యాధికారి ఎస్.సుమంత్ సూచించారు. శనివారం మండల కేంద్రం కొల్లిపర చివారు గుదిబండివారిపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ సుస్మితా, ఎఎన్ఎమ్ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆశా కార్యకర్తలు జయప్రద, మల్లేశ్వరి, భవాని, విజయకుమారి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

- జై భీం సమూహం నిర్వాహకులు శామ్యూల్ రాజ్
- ప్రాథమిక హక్కులపై విద్యార్థులకు పోటీ పరీక్ష



రాజ్యాంగంపై పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పొన్నూరుటౌన్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం అని పొన్నూరు - నిడుబ్రోలు జై భీం సమూహం నిర్వాహకులు ఎద్దు శామ్యూల్ రాజ్ అన్నారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం 'రాజ్యాంగం- ప్రాథమిక హక్కులు' అనే అంశంపై విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జై భీం సమూహం నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలి పారు. రాజ్యాంగ దినోత్సవం రోజున స్థానిక ఐలాండ్ సెంటర్ లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగే సభలో విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పీ శ్రీనివాసరావు, వెంకట్రావు, జై భీం సమూహం నిర్వాహకులు వేముల నిరీక్షణ, యడ్ల వందనం, గుమ్మడి రోశయ్య, మంద్రు వెంకట రత్నం తదితరులు పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి.. కేసు

తెనాలి మారీసుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భార్యపై కత్తితో దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక వైకుంఠపురంకు చెందిన సామ్యూల్ రోజువారి కూలీగా పనిచేస్తుంటాడు. ఇతనికి అదే ప్రాంతానికి చెందిన సంధ్యతో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. కొంతకాలం నుంచి భార్యాభర్తల మధ్య వివిధ కారణాలతో మనస్పర్ధలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో భర్తను వీడి సంధ్య తన పిల్లలతో కలసి పుట్టింటిలో ఉంటుంది. ఇదిలా ఉండగా శనివారం వైకుంఠపురం సమీపంలో మాట్లాకుందామని భార్యను పిలిచిన సామ్యూల్ తనతో తెచ్చిన కత్తితో ఆమెపై దాడిచేసి అనంతరం పారిపోయాడు. రక్తపు గాయాలపాలైన ఆమెను స్థానికులు జిల్లా వైద్యశాలకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

మరుగుదొడ్డి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలి

కొల్లిపర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలు మరుగుదొడ్డి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని ఈవోపీఆర్‌డీ భార్గవ్ కోరారు. శనివారం మండల కేంద్రం కొల్లిపర పంచాయతీ కార్యాలయంలో అధికారులు మరుగుదొడ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ ఇంటింటికీ మరుగుదొడ్డి తప్పని సరిగా ఉండాలన్నారు. నిరుపేదలై ఉండి మరుగుదొడ్డి లేకపోతే దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రభుత్వం రూ 12వేలు ఇవ్వనున్నట్లు తెలియజేశారు. బహిరంగ మలవిసర్జన చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బహిరంగా మల విసర్జన చేస్తే వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. సమావేశంలో మండల కో-ఆర్డినేటర్ మర్రెడ్డి వెంకటరెడ్డి, కార్యదర్శి అలకనంద, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.